RNI-TELTEL/2017/72695

11 సెప్టెంబర్ 2023

# శుభ తెలంగాణ

సోమవారం | మేడ్చల్

ఎడిటర్: చంద్రశేఖర్

సంపుటి : 6, సంచిక :188

వెల:3 రూ/-

www.subhatelangana.in

Published From Medchal, Circulated at Jagtial, Jangaon, Jayashankar, Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri, Bhuvanagiri.

## విశ్వమంతా శాంతి విలసిల్లు గాక!

'స్వస్తి అస్తి విశ్వ' ప్రార్థనా శ్లోకంతో జీ20ని ముగించిన ప్రధాని మోదీ

ఐరాస భద్రతామండలిని సంస్కరించాలి.. ముగింపు సమావేశంలో మోదీ పిలుపు

జీ20ని భారత్ నిర్వహించిన తీరుపై సభ్యదేశాల అధినేతల ప్రశంసల జల్లు




**హైదరాబాద్(శుభ తెలంగాణ):** ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలో భారత్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన, పలు సభ్యదేశాల అంచనాలను తలకిందులు చేస్తూ ఏకాభిప్రాయ ప్రకటనను వెలువరించిన జీ20 శిఖరాగ్ర సమావేశాలు 'స్వస్తి అస్తి విశ్వ' అనే ప్రార్థనతో ఆదివారం ముగిశాయి. ఈ సంస్కృత వాక్యానికి అర్థం.. విశ్వమంతటా శాంతి విలసిల్లు గాక! వచ్చే ఏడాది జీ 20కి అధ్యక్షత వహించనున్న బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డసిల్వకు ఆనవాయితీ ప్రకారం మోదీ చిన్న సుత్తి లాంటి దానిని (గావెల్) అందించారు. 'జీ 20 శిఖరాగ్ర సమావేశాలు ముగిశాయని ప్రకటిస్తున్నా. ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు దిశగా మన కార్యాచరణ సంతోషంగా ఉంటుందని ఆశిస్తున్నా. కృతజ్ఞతలు' అంటూ

వివరాలు 2లో..



## దొంగ డిక్లరేషన్‌ల కాంగ్రెస్‌ను ఎవరూ నమ్మరు

జిల్లా కేంద్రాల్లో త్వరలోనే నీరా కేఫ్‌లు: హరీశ్

**హైదరాబాద్(శుభ తెలంగాణ):** దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మత్స్యకారులకు ఉచిత చేప పిల్లలు, బీమా సౌకర్యం, మోపెడ్ వావాహనాలతో పాటు, రాష్ట్రంలోనే మొదటిసారిగా సిద్దిపేటలోనే మత్స్యకారులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులను ఇచ్చిందని మంత్రులు హరీశ్‌రావు, శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఆదివారం సిద్దిపేటలో ఉచిత చేపపిల్లల పంపిణీ కార్యక్రమానికి వారు హాజరయ్యారు. అనంతరం సిద్దిపేటలో మత్స్యకారుల గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమంలో, సిద్దిపేటలోనే శ్రీమహా రేణుకామాత కన్వెషన్ సెంటర్‌ను డిప్యూటీ స్పీకర్ పద్మారావుతో కలిసి ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పూటకొక దొంగ డిక్లరేషన్ చేసే కాంగ్రెసను ఎవ్వరూ నమ్మరని చెప్పారు. మూడోసారి కూడా సీఎం కేసీఆరే అని తెలంగాణ ప్రజలు సెల్ఫ్ డిక్లరేషన్ చేశారన్నారు. హైదరాబాద్ తరహాలోనే త్వరలోనే అన్ని జిల్లా కేంద్రాల్లో నీరా కేఫ్‌లు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. లంచాల కోసం ఆనాటి పాలకులు కల్లు డిపోలను మూసివేయగా నేడు బీఆర్ఎస్ ప్రభుత్వం మద్యం దుకాణాలలో గౌడ కులస్థులకు

వివరాలు 2లో..

## గజ్వేల్, సిరిసిల్ల, సిద్దిపేటనే ముఖ్యమా?

మీరు ఆ నియోజకవర్గాలకే సీఎం, మంత్రులా?..

కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌లకు రేవంత్ ప్రశ్న



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులకు గజ్వేల్, సిరిసిల్ల, సిద్దిపేట నియోజకవర్గాలే ముఖ్యమా అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఆ మూడు నియోజకవర్గాలకు మాత్రమే వారు సీఎం, మంత్రులుగా పని చేస్తున్నారని మండిపడ్డారు. ఆ నియోజకవర్గాలకే నిధులు కేటాయించి అభివృద్ధి చేసుకుంటున్నారని ఆరోపించారు. కొడంగల్ నియోజకవర్గం రాష్ట్రంలో భాగం కాదా అని ప్రశ్నించారు. కొడంగల్ నియోజకవర్గానికి చెందిన పలువురు బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ఆదివారం రేవంత్ నివాసంలో ఆయన సమక్షంలో కాంగ్రెసలో చేరారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ కొడంగల్‌ను అభివృద్ధి చేస్తామన్న బీఆర్ఎస్ నేతలు ఐదేళ్లలో నియోజకవర్గానికి ఏం చేశారని నిలదీశారు. కొడంగల్‌ను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తానని చెప్పిన కేటీఆర్.. నియోజకవర్గ ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. నారాయణపేట్ – కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని పడావు పెట్టారని, బొంరాసపేట, దౌల్తాబాద్‌లలో జూనియర్ కాలేజీలు ఏర్పాటు చేయలేదని, వికారాబాద్–తాండూర్ రైల్వే లైన్‌కు ఇప్పటికీ మోక్షం ఓట్లకోసం వచ్చే బీఆర్ఎస్ నేతలను కొడంగల్‌కు ఏం చేశారో చెప్పాలని నిలదీయాలని ఆయన అన్నారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 35 వేల పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, ఈ నెల 17న తుక్కుగూడలో జరగనున్న కాంగ్రెస్ జయభేరి సభకు ప్రతి బూత్ నుంచీ జనం తరలి వచ్చేలా చూడాలని డీసీసీ అధ్యక్షులకు టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సూచించారు. ప్రతి ఒక్కరూ సమన్వయం చేసుకుని సభను విజయవంతం చేయాలన్నారు. పది లక్షల మందితో తుక్కుగూడ సభను నిర్వహించాలని

వివరాలు 2లో..

## విషాదం మిగిల్చిన విహారం

కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టి ఇద్దరి మృతి.. ఇద్దరికి గాయాలు

చేవెళ్ల సమీపాన రోడ్డు ప్రమాదం



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** సెలవు రోజు అని నలుగురు స్నేహితులు చేసిన విహారయాత్ర విషాదంగా మిగిలింది. ఇంటికి తిరిగొచ్చే క్రమంలో వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టడంతో ఆ స్నేహితుల్లో ఇద్దరు అక్కడికక్కడే కన్నుమూశారు. మరో ఇద్దరు తీవ్ర గాయాలతో ఆస్పత్రిపాలై ప్రాణాల

వివరాలు 2లో..

## హైదరాబాద్‌లో భారీ వర్షం!

లంగర్‌హౌజ్, ముషీరాబాద్‌లో 4.3 సెం.మీ. వర్షపాతం

రాష్ట్రంలో రెండ్రోజులు వర్షాలు



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** హైదరాబాద్‌లో పలుచోట్ల భారీ వర్షం కురిసింది. ఆదివారం మధ్యాహ్నం నుంచి పలు ప్రాంతాల్లో కుండపోతతో వరదలు రహదారులను ముంచేశాయి. పలు ప్రాంతాల్లో వరద నీరు నిలిచి ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. లంగర్‌హౌస్, ముషీరాబాద్ ప్రాంతాల్లో అత్యధికంగా 4.3 సెం.మీ. వర్షం కురిసింది. మియాపూర్, కుత్బుల్లాపూర్, బేగంపేట బ్రాహ్మణవాడి, ముషీరాబాద్, యూసుఫగూడ కృష్ణానగర్, నిజాంపేట, గాజులరామారంలోని లోతట్టు ప్రాంతాల్లో భారీగా వరద నీరు రోడ్లపైనే నిలిచిపోవడంతో స్థానికులు వణికి పోయారు. సికింద్రాబాద్, చార్మినార్, లిబర్టీ, కోఠి, ఉప్పల్, దిల్‌సుఖ్‌నగర్, మణికొండ

వివరాలు 2లో..

## చంద్రబాబుకు 14 రోజుల రిమాండ్..

రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలింపు




స్కిల్ డెవలప్ మెంట్ స్కాం కేసులో చంద్రబాబు అరెస్ట్

నంద్యాల నుంచి కుంచనపల్లి తరలించిన సీఐడీ అధికారులు

ఈ ఉదయం ఏసీబీ కోర్టులో హాజరు

దాదాపు 8 గంటల పాటు సాగిన వాదనలు

తీర్పును రిజర్వ్ లో ఉంచిన న్యాయమూర్తి

వివరాలు 2లో..

## బీజేపీ పనుల్లో 'హిందూ' లేదు



నేను గీత చదివా..

ఉపనిషత్తులు చదివా

ఇండియా అయినా.. భారత్ ఐనా ఓకే

మార్పు వెనుక ఉద్దేశాలే అసలు సంగతి

పారిస్ విద్యార్థులతో చర్చలో రాహుల్

**హైదరాబాద్(శుభ తెలంగాణ):** "నేను భగవద్గీత చదివాను. ఉపనిషత్తులూ చదివాను. అలాగే చాలా హిందూ పుస్తకాలు కూడా చదివాను. బీజేపీ చేసే ఏ పనిలోనూ హిందూ లేదు" అని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ బీజేపీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పారిసలోని సైన్సెస్ పీవో యూనివర్సిటీలో విద్యార్థులతో జరిగిన చర్చాకార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కొందరు విద్యార్థులు భారత్‌లో పెరుగుతున్న హిందూ జాతీయవాదం గురించి ప్రశ్నించగా.. "నీకంటే బలహీనులైనవారిని భయపెట్టొచ్చని, వారికి హాని చేయొచ్చని నేను ఏ హిందూ పుస్తకంలోనూ చదవలేదు. ఏ ప్రముఖ హిందువు నుంచీ వినలేదు. కాబట్టి ఈ 'హిందూ జాతీయవాదులు' అనే పదం తప్పు పదం. వారు హిందూ

వివరాలు 2లో..

## సూడాన్‌లో డ్రోన్ దాడిలో 43 మంది మృతి!



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** దేశంపై పట్టు కోసం సైన్యం, పారామిలిటరీ రాపిడ్ సపోర్ట్ ఫోర్స్ మధ్య కొనసాగుతున్న పోరుతో మరోసారి సూడాన్ రక్తసిక్తంగా మారింది. ఆదివారం (సెప్టెంబర్ 10న) సూడాన్ రాజధాని ఖార్టూమ్‌లోని మార్కెట్‌లో డ్రోన్ దాడి జరిగింది. ఈ దాడిలో 40 మంది చనిపోయారు. దాదాపు 36 మందికి పైగా తీవ్రంగా గాయపడినట్లు అక్కడి అధికారులు తెలిపారు. గాయపడిన వారిని సూడాన్‌లోని బషీర్ యూనివర్సిటీ ఆసుపత్రికి తరలించారు. మయో ప్రాంతంలో పెద్దఎత్తున పారామిలిటరీ బలగాలు మోహరించి ఉన్నట్లు స్థానిక

వివరాలు 2లో..

# విశ్వమంతా శాంతి విలసిల్లు గాక!

- మొదటి పేజి తరువాయి

మోదీ ఈ సమావేశాల్ని ముగించారు. మరోవైపు, ఉక్రెయిన్–రష్యా యుద్ధంపై జీ 20 సభ్యదేశాల మధ్య తీవ్రమైన విభేదాలు ఉన్నప్పటికీ, ఏకాభిప్రాయాన్ని సాధించి ఢిల్లీ డిక్లరేషన్‌కు ఆమోదం లభించేలా భారత్ జరిపిన కృషిపై పలు దేశాధినేతలు ప్రశంసలు కురిపించారు. ముఖ్యంగా, రష్యా భారత్ సారథ్యాన్ని ఎంతగానో కొనియాడింది.

**ఐరాసలో నాడు 51.. నేడు 200 దేశాలు**

రెండురోజుల పాటు కొనసాగిన శిఖరాగ్ర సమావేశాలకు చివరి రోజైన ఆదివారం 'ఒకే భవిష్యత్తు' పేరిట ముగింపు సదస్సు జరిగింది. దీనిని ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. ఐరాసలో చేపట్టాల్సిన సంస్కరణలను ప్రముఖంగా ప్రస్తావించారు. 'ప్రపంచాన్ని మెరుగైన భవిష్యత్తు వైపు తీసుకెళ్లాలంటే అంతర్జాతీయ సంస్థలు ప్రస్తుత వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలి. ఐరాస ఏర్పాటైనప్పుడు సభ్యదేశాల సంఖ్య 51. నేడు ఐరాసలో దాదాపు 200 దేశాలు సభ్యత్వాన్ని కలిగి ఉన్నాయి. అయినప్పటికీ, ఐరాస భద్రతామండలిలో శాశ్వత సభ్యదేశాల సంఖ్య (5) మార్పు లేకుండానే ఉంది. అప్పటికి ఇప్పటికి రవాణా, కమ్యూనికేషన్, ఆరోగ్యం, విద్య.. ప్రతీ రంగం మారిపోయింది. కాబట్టి, మన నూతన ప్రపంచ వ్యవస్థల్లో ఈ నూతన మార్పులు కూడా ప్రతిఫలించాలి. దీంట్లో భాగంగానే, 55 దేశాల కూటమి అయిన ఆఫ్రికన్ యూనియన్‌కు జీ 20లో శాశ్వత సభ్యత్వం ఇస్తూ చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నాం' అని మోదీ చెప్పారు. సైబర్ సెక్యూరిటీ, క్రిప్టో కరెన్సీ అనేవి అత్యంత కీలకమైన అంశాలని, ఇవి వర్తమానాన్నేగాక భవిష్యత్తును కూడా తీవ్రంగా ప్రభావితం చేయనున్నాయని తెలిపారు. 'సైబర్‌స్పేసను సురక్షితంగా మల్చటానికి అంతర్జాతీయ సహకారం, మార్గదర్శక ప్రణాళిక అవసరం' అని మోదీ పేర్కొన్నారు. జీ20 సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలుపై నవంబరులో వర్చువల్‌గా (వీడియో కాన్ఫరెన్స్ ద్వారా) సమీక్ష జరుపుదామని సభ్యదేశాల అధినేతలకు మోదీ ప్రతిపాదించారు. నవంబరు 30 వరకూ జీ 20కి భారత్ అధ్యక్షత కొనసాగుతుందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. చివరగా, 'స్వస్తి అస్తి విశ్వ' అనే ప్రార్థనతో జీ 20 సమావేశాలు ముగిశాయని మోదీ ప్రకటించారు. ముగింపు సదస్సు ప్రారంభంలో జీ 20కి గతేడాది సారథ్యం వహించిన ఇండొనేషియా, వచ్చే ఏడాది అధ్యక్షత వహించనున్న బ్రెజిల్ అధ్యక్షులు ఆనవాయితీ ప్రకారం మోదీకి మొక్కలందించారు.

**భేష్ భారత్**

జీ 20 సమావేశాల్ని భారత్ నిర్వహించిన తీరుపై పలు దేశాల అధినేతలు ప్రశంసల జల్లు కురిపించారు. వాతావరణ మార్పులు, సంక్షోభాలతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సతమతమవుతున్న నేపథ్యంలో, అనేక సమస్యలకు జీ 20 పరిష్కారం చూపగలదని ఢిల్లీ సమావేశాలు నిరూపించాయని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుత విభజిత (రాజకీయ) వాతావరణంలో జీ 20 సారథిగా భారత్ బాగా పని చేసిందని ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ అన్నారు. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలకు భారత్ గొంతుకను ఇచ్చిందని బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డసిల్వ ప్రశంసించారు.

**మోదీ విజయమే కానీ...**

పలు అంశాలపై సభ్య దేశాల మధ్య విభేదాలు ఉన్నప్పటికీ జీ20 డిక్లరేషన్‌పై ఏకాభిప్రాయం సాధించడం ప్రధాని మోదీ విజయంగా అంతర్జాతీయ మీడియా పేర్కొంది. అయితే ఉక్రెయిన్ యుద్ధాన్ని మాత్రం డిక్లరేషన్ స్పష్టంగా ఖండించలేకపోయిందని విమర్శించింది. ఈ ఏడాది జీ20లో ఉక్రెయిన్‌పై ఏకాభిప్రాయం కుదురుతుందన్న అంచనాలు చాలా తక్కువగా ఉన్న నేపథ్యంలో పీటముడి పరిష్కరించడం మోదీ గెలుపే అయినప్పటికీ రష్యా విషయంలో మెతక వైఖరిని డిక్లరేషన్ ప్రతిబింబించిందని సీఎన్ఎన్ విమర్శించింది. రష్యా చొరబాటును డిక్లరేషన్ విస్మరించిందని న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది. రష్యాను ఖండించడంలో గతేడాది బాలీ డిక్లరేషన్ అంత బలంగా ఢిల్లీ డిక్లరేషన్ లేదని బీబీసీ వ్యాఖ్యానించింది.

**పశ్చిమదేశాల ఏకఛత్రాధిపత్యం ఇకపై సాగదు**

రష్యా అధ్యక్షుడు పుతిన్ తరఫున హాజరైన ఆ దేశ విదేశాంగమంత్రి సెర్గీ లావ్రోవ్ విలేకర్లతో మాట్లాడుతూ.. ఉక్రెయిన్ వివాదంతోపాటు పలు ఇతర అంశాలపైనా పశ్చిమ దేశాలు తమ వైఖరినే ఏకపక్షంగా ముందుకు తీసుకువెళ్లకుండా నిరోధించటంలో భారత్ ముఖ్యమైన పాత్ర పోషించిందన్నారు. జీ 20ని రాజకీయం చేయటానికి జరిగిన ప్రయత్నాలను అడ్డుకున్న భారత్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని చెప్పారు. ప్రపంచంలో కొత్త అధికార కేంద్రాలు ఉద్భవిస్తున్నాయని, పశ్చిమ దేశాల ఏకఛత్రాధిపత్యం ఇంకా ఎంతోకాలం కొనసాగదని లావ్రోవ్ పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో భారీ వర్షం!

- మొదటి పేజి తరువాయి

తదితర ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి అక్కడి వారు ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన వరద నీటిని తొలగించేందుకు జీహెచ్ఎంసీ డిజాస్టర్ బృందాలు రంగంలోకి దిగాయి.

**నేడు, రేపు వర్షాలు..**

రాష్ట్రంలో రెండ్రోజుల పాటు (సోమ, మంగళవారాల్లో) తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. మంగళవారం నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో
ఒక ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశముందని తెలిపింది. వాయవ్య మధ్యప్రదేశ్, ఈశాన్య రాజస్థాన్‌పై ఉన్న ఉపరిత ఆవర్తనం నుంచి ఒక ద్రోణి దక్షిణ ఛత్తీసగఢ్ వరకు సముద్రమట్టం నుంచి 4.5 కిలోమీటర్ల వరకు కొనసాగుతున్నట్లు వివరించింది.

## విషాదం మిగిల్చిన విహారం

- మొదటి పేజి తరువాయి

కోసం పోరాడుతున్నారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఆలూర్ స్టేజి సమీపంలో హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్, కొంపల్లిలోని సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ థర్డ్ ఇయర్ చదువుతున్న మండవ ప్రదీప్ కుమార్(19), చిప్పడి సోని(19), అఖిల్, ఆర్యవర్ధన్ స్నేహితులు. కాలేజీకి సెలవు కావడంతో నలుగురు కలిసి వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి హిల్స్‌కు విహారయాత్రకు వెళ్లారు. అఖిల్ కారులో శనివారం మధ్యాహ్నం అనంతగిరి హిల్స్‌కు వెళ్లిన వీరు ఆ రోజు రాత్రి అక్కడే బస చేసి ఆదివారం ఉదయం హైదరాబాద్‌కు తిరుగుప్రయాణమయ్యారు. అయితే, కారు ఆలూర్ స్టేజీ వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. దీంతో వెనుక సీట్లో ఉన్న ప్రదీప్, సోని అక్కడికక్కడే మరణించారు. తీవ్ర గాయాలపాలైన అఖిల్, ఆర్యవర్ధన్‌ను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా, మృతుడు ప్రదీపకుమార్ తండ్రి వెంకటశేషారావు ఏపీలోని ప్రకాశం జిల్లాకు చెందినవారు. కొన్నేళ్లుగా నగరంలోని కేపీహెచ్‌బీ ధర్మారెడ్డి కాలనీలో ఉంటున్నారు. ఒక్కగానొక్క కొడుకు మృతితో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. మృతురాలు సోని తండ్రి మధుసూదన్‌రెడ్డి ఏపీలోని కడప జిల్లాకు చెందిన వారు. ప్రైవేటు ఉద్యోగైన మధుసూదన్ రెడ్డి కుటుంబంతో సహా హైదరాబాద్‌లోని కర్మన్‌ఘాట్‌లో నివాసముంటున్నారు.

## గజ్వేల్, సిరిసిల్ల, సిద్దిపేటనే ముఖ్యమా?

- మొదటి పేజి తరువాయి

పార్టీ నిర్ణయించిన నేపథ్యంలో సభా ఏర్పాట్లపైన రాష్ట్రంలోని అన్ని జిల్లాల పార్టీ అధ్యక్షులతో ఆదివారం రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, సీఎల్పీ నేత భట్టివిక్రమార్క, కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేషకుమార్‌గౌడ్‌లు జూమ్ యాప్ ద్వారా సమావేశమయ్యారు. రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. జయభేరి సభకు సంబంధించి ఈ నెల 11 నుంచి రాష్ట్రంలోని అన్ని మండలాల్లో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. సోమవారం పార్లమెంటు అబ్జర్వర్లు, టీపీసీసీ ఉపాధ్యక్షులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

## చంద్రబాబుని టార్చర్ పెట్టారు..
# రేపటి నుంచి మేమేందో మీకు చూపిస్తాం

**ప్రతిష్ఠాత్మకమైన జీ20 సమ్మిట్ ను జగన్ నాశనం చేశాడన్న పవన్**

**ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం ఆలోచించాలని వ్యాఖ్య**

**మన ఓటు శాతం బాగా పెరిగిందన్న పవన్**



టీడీపీ అధినేత చంద్రబాబుకు ఏసీబీ కోర్టు రిమాండ్ విధించిన తర్వాత జనసేనాని పవన్ కల్యాణ్ స్పందించారు. దేశంలో జీ20 సమావేశాలు జరుగుతున్న సమయంలో... ఏపీ ముఖ్యమంత్రి జగన్ నీచమైన రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇంత కీలకమైన సమ్మిట్ జరుగుతున్న సమయంలో... ఈ వ్యక్తి జగన్ మొత్తం నాశనం చేశారని చెప్పారు. జగన్ కోసం కేంద్రం ఎంతో చేస్తే... కేంద్రం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన జీ20ని జగన్ చంపేశారని అన్నారు. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం కూడా ఆలోచించాల్సిన అవసరం ఉందని చెప్పారు.

వివేకానందరెడ్డి హత్య కేసులో అన్ని వ్యవస్థలను జగన్ చంపేశాడని, వివేకాను చంపేసిన వ్యక్తి బయట తిరుగుతున్నాడని మండిపడ్డారు. ఎంతో ప్రజాదరణ ఉన్న తనను, 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబును రోడ్ల మీద తిరగనీయకుండా ఆపేస్తున్నారంటే... ఈ విషయంపై రాష్ట్ర ప్రజలంతా ఆలోచించాలని చెప్పారు. రాష్ట్ర పరిస్థితిని వైసీపీ ప్రభుత్వం మార్చేసిందని మండిపడ్డారు. మద్యపాన నిషేధం చేస్తానన్న జగన్... అదే మద్యాన్ని వ్యాపారంగా మార్చుకున్నారని దుయ్యబట్టారు.

కోర్టులు ఎక్కడ పని చేస్తున్నాయని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. వైసీపీ వాళ్లు యుద్ధం కోరుకుంటున్నారని... మేము వెనకడుగు వేసే ప్రసక్తే లేదని అన్నారు. నువ్వు మర్డర్లు చేసి, దారి దోపిడీలు చేసిన వారిని కాపాడుతూ, ఇసుకను దోచేస్తున్న వారికి అండగా ఉన్న నీకు మేము భయపడమని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మీరు చేస్తున్న అక్రమ వ్యాపారాల వల్ల రాష్ట్రంలో ఎంతో పొల్యూషన్ వస్తోందని మండిపడ్డారు.

ఫీజు రీయింబర్స్ మెంట్ ఇవ్వకుండా విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తున్నాడని విమర్శించారు. చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉన్నాయని... రాష్ట్ర ప్రజలు వీటి గురించి ఆలోచించాలని చెప్పారు. పనికిమాలిన ప్రభుత్వం గురించి మాట్లాడటం ప్రజాస్వామ్యంలో అందరికీ ఉన్న హక్కు అని అన్నారు. మనకు ఓటు శాతం చాలా బలంగా పెరిగిందని, ఎంత శాతం పెరిగిందనేదాని గురించి ఇప్పుడు మాట్లాడనని చెప్పారు. రాష్ట్రంలో అందరికీ పిరికితనం ఆవహించిందని అసహనం వ్యక్తం చేశారు. ఎంతకాలం పిరికిగా బతుకుతామని ప్రశ్నించారు. సొంత చిన్నాన్నను చంపిన చరిత్ర వీరిదని మండిపడ్డారు.

తాను బతికి ఉన్నంత కాలం రాష్ట్రం కోసం పోరాడుతూనే ఉంటానని చెప్పారు. చంద్రబాబుకు తాను పూర్తి మద్దతును ప్రకటిస్తున్నానని అన్నారు. చంద్రబాబుని టార్చర్ పెట్టారని... మిమ్మల్ని నేను వదులుతానని అనుకుంటున్నారా? అని ప్రశ్నించారు. రేపటి నుంచి మేమేందో మీకు చూపిస్తామని హెచ్చరించారు.

## చంద్రబాబుకు 14 రోజుల రిమాండ్..

స్కిల్ డెవ్ లప్ మెంట్ స్కాం కేసులో టీడీపీ అధినేత చంద్రబాబుకు ఏసీబీ కోర్టు రిమాండ్ విధించింది. ఇవాళ ఉదయం(సెప్టెంబర్ 10) 8 గంటల నుంచి వాదోపవాదనలు విన్న కోర్టు చంద్రబాబుకు 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధిస్తున్నట్లు తీర్పునిచ్చింది. దీంతో చంద్రబాబు సెప్టెంబర్ 22 వరకు రిమాండ్ లో ఉండనున్నారు. చంద్రబాబును రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించాలని కోర్టు ఆదేశించింది. దీంతో పోలీసులు చంద్రబాబును రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించనున్నారు.

చంద్రబాబు కేసుపై ఏసీబీ కోర్టులో సీఐడీ తరఫున ఏఏజీ పొన్నవోలు సుధాకర్ రెడ్డి, చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా దాదాపు ఏడున్నర గంటలు వాడివేడీగా వాదనలు వినిపించారు.

**చంద్రబాబు తరపున లూథ్రా వాదనలు**

చంద్రబాబుపై సెక్షన్ 409 నమోదు చేయడంపై సిద్దార్థ లూథ్రా అభ్యంతరం వ్యక్తం చేశారు. 409 సెక్షన్ పెట్టాలంటే ముందుగా సాక్ష్యం చూపించాలని కోర్టుకు తెలిపారు. చంద్రబాబు అరెస్టు చేసే ముందు గవర్నర్ అనుమతి తీసుకోవాలి కానీ.. సీఐడీ ఆ పని చేయలేదన్నారు . ఇది చట్ట విరుద్ధమని లూథ్రా కోర్టులో వాదించారు. చంద్రబాబు హక్కులకు భంగం కలిగేలా సీఐడీ పోలీసులు వ్యవహరించారని లూథ్రా కోర్టుకు తెలిపారు.

**సీఐడీ వాదనలు**

చంద్రబాబును కస్టడీకి ఇవ్వాలని అడిషనల్ అడ్వొకేట్ జనరల్ సుధాకర్ రెడ్డి కోర్టును కోరారు. చంద్రబాబును 24 గంటల్లోపూ కోర్టులో ప్రవేశ పెట్టామని చెప్పారు. ఈ కేసులో ఇప్పటి వరకు ఏడుగుర్ని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. 2015లో విడుదలైన జీవో నెంబర్ 4తో కుట్ర జరిగిందన్నారు. చంద్రబాబు అరెస్ట్ కు గవర్నర్ అనుమతి అవసరం లేదని చెప్పారు. మాజీ సీఎం గౌరవప్రదమైన హోదా మాత్రమేనని చెప్పారు. చంద్రబాబు ప్రస్తుత హోదా జస్ట్ ఎమ్మెల్యే అని చెప్పారు.

స్కిల్ డెవ్ లప్ మెంట్ స్కీంలో రూ.271 కోట్లు దారిమళ్లించారని చంద్రబాబుపై సీఐడీ అభియోగం మోపింది. దీంతో చంద్రబాబును సెప్టెంబర్ 9న ఉదయం 6 గంటలకు నంద్యాలలో అరెస్ట్ చేశారు. అనంతరం విజయవాడ సిట్ ఆఫీస్ కు తరలించారు. అక్కడ సీఐడీ అధికారులు చంద్రబాబును రాత్రంతా విచారించారు. ఇవాళ(సెప్టెంబర్ 10)న కోర్టులో ప్రవేశ పెట్టారు.

## బీజేపీ పనుల్లో 'హిందూ' లేదు

- మొదటి పేజి తరువాయి

జాతీయవాదులు కారు. వారికి హిందూయిజంతో ఎలాంటి సంబంధమూ లేదు. ఎట్టి పరిస్థితుల్లోనూ అధికారం చేజిక్కించుకోవాలన్నదే వారి లక్ష్యం" అని బదులిచ్చారు. భారతీయ ఆత్మను కాపాడే పోరాటానికి విపక్ష కూటమి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రస్తుతం కల్లోల స్థితిలో ఉన్న భారతదేశ పరిస్థితి బాగుపడుతుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు. ఇండియా పేరును మారుస్తారంటూ జరుగుతున్న ప్రచారంపై ప్రశ్నించగా.. రాజ్యాంగంలో భారత్, ఇండియా అనే రెండు పేర్లూ ఉన్నాయని రాహుల్ గుర్తుచేశారు. దేశాన్ని ఈ రెండింటిలో ఏ పేరుతోనైనా పిలవొచ్చని.. కానీ, మార్పు వెనుక ఉన్న ఉద్దేశమే అసలు విషయమని వ్యాఖ్యానించారు. విపక్షాలు తమ కూటమికి ఇండియా (ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇంక్లూజివ్ అలయెన్స్) అనే పేరు పెట్టుకోవడం ప్రభుత్వాన్ని ఆందోళనకు గురిచేసిందని.. అందుకే ఇలా వింతగా ప్రవర్తిస్తోందని, దేశం పేరు మార్చాలనుకుంటోందని విమర్శించారు. పేరు మార్చాలనుకునే వ్యక్తులు ప్రాథమికంగా చరిత్రను తిరస్కరిస్తున్నట్టేనని.. మనకు నచ్చినా, నచ్చకున్నా మనకంటూ ఒక చరిత్ర ఉందన్న మాట వాస్తవమని వ్యాఖ్యానించారు. "వారు సమాజాన్ని విభజిస్తారు. విద్వేషాన్ని వ్యాపింపజేస్తారు. అది వారి విధానం. తమకు ఆర్థికసాయం అందించి, మద్దతునిచ్చే.. దేశంలోని అత్యంత శక్తిమంతులైన, సంపన్నులైన క్రోనీ క్యాపిటలిస్టులతో వారికి సత్సంబంధాలున్నాయి" అని బీజేపీని, అదానీ వంటి పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి రాహుల్ నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు.

## సూడాన్‌లో డ్రోన్ దాడిలో 43 మంది మృతి!

- మొదటి పేజి తరువాయి

వార్తాసంస్థలు వెల్లడించాయి. ఈ దాడికి సైన్యానికి చెందిన వైమానిక దళమే కారణమని ఆర్ఎస్ఎఫ్ ఆరోపించింది. ఏప్రిల్ 15న సూడాన్‌లో ప్రారంభమైన అంతర్యుద్ధం తర్వాత పౌరుల మరణాల సంఖ్య ఇదే అత్యధికం. ప్రస్తుతం నివాస ప్రాంతాలపై దాడి పరిధి పెరుగుతోంది. ఇక్కడ అధికారం కోసం సైన్యం, పారామిలటరీ బలగాల మధ్య ఏప్రిల్ నుంచి పోరాటం సాగుతోంది. ఆగస్టు నాటి యూఎన్ గణాంకాల ప్రకారం సైన్యం, పారామిలిటరీ దళం మధ్య జరిగిన ఘర్షణల్లో నాలుగువేల మందికి పైగా మరణించారు. అంతర్యుద్ధం కారణంగా పెద్ద సంఖ్యలో ప్రజలు నిరాశ్రయులయ్యారు. హింస కారణంగా దాదాపు 71 లక్షల మంది ప్రజలు తమ ఇళ్లను విడిచిపెట్టారు. 11 లక్షల మంది ప్రజలు విదేశాల్లో ఆశ్రయం పొందగా, లక్షలాది మంది దేశంలోనే ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్నారు.

## ఏపీలోని అన్ని జిల్లాల్లో 144 సెక్షన్ విధింపు...
## నేడు బంద్ కు పిలుపునిచ్చిన టీడీపీ

టీడీపీ అధినేత చంద్రబాబు రిమాండ్ కు నిరసనగా రేపు (సెప్టెంబర్ 11) ఏపీ బంద్ కు టీడీపీ పిలుపునిచ్చింది. రాజకీయ కక్ష సాధింపుతో చేసిన అరెస్టును బంద్ ద్వారా ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరింది. ప్రజా సమస్యలపై పోరాడుతున్న తమ అధినేత గొంతు నొక్కేందుకే ఇలా చేశారని టీడీపీ నేతలు ధ్వజమెత్తారు. ఎమర్జెన్సీ సేవల్లోని వారు మినహా మిగతా వర్గాలు అన్నీ బంద్ కు సహకరించాలని నేతలు కోరారు.

మరో వైపు రాష్ట్ర వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు చేయాలంటూ అన్ని జిల్లాల ఎస్పీలకు డీజీపీ ఆదేశాలు జారీ చేశారు. అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు నిర్వహించకూడదని హెచ్చరించారు.

స్కిల్ డెవ్ లప్ మెంట్ స్కాం కేసులో చంద్రబాబుకు విజయవాడ ఏసీబీ కోర్టు 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. దీంతో చంద్రబాబు సెప్టెంబర్ 22 వరకు రిమాండ్ లో ఉండనున్నారు.

## దొంగ డిక్లరేషన్‌ల కాంగ్రెస్‌ను ఎవరూ నమ్మరు

- మొదటి పేజి తరువాయి

రిజర్వేషన్‌లు కల్పించిందని చెప్పారు. మంత్రి శ్రీనివాసయాదవ్ మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ లేని విధంగా చేపలు, రొయ్యలు, గొర్రెల పంపిణీ ఉచితంగా చేస్తున్న ప్రభుత్వం బీఆర్ఎస్ ఒక్కటే అని చెప్పారు. డిప్యూటీ స్పీకర్ పద్మారావు, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శుభ తెలంగాణ
TELTEL/2017/72695
ఉన్నది ఉన్నట్లుగా రాసే తెలుగు దినపత్రిక
సోమవారం | మేడ్చల్
11 సెప్టెంబర్ 2023
www.subhatelangana.in



# తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ వర్ధంతి..

**ఎల్బీనగర్, శుభ తెలంగాణ :**చిట్యాల( చాకలి)ఐలమ్మగా గుర్తింపు పొందిన తెలంగాణా వీరవనిత సామాజిక ఆధునిక పరిణామానికి నాంది పలికిన స్త్రీ ధైట్కర్య శాలి ,భూమి కోసం.భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన తెలంగాణ ప్రజల తెగువను,పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పు కణిక మన తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా స్మరిస్తూ వారికి మా ఘన నివాళుల అర్పిస్తూ..

భారతమాత విముక్తి పోరాటంలో ఎందరో త్యాగధనులు, పురుషులు, స్త్రీలు, పసిపిల్లలు అమరత్వం పొందితే నిజాం నిరంకుశ పాలన నుండి విముక్తి పొందేందుకు వీరోచిత పోరాటం చేసిన పసి పిల్లల నుంచి వృద్ధుల వరకు స్త్రీ పురుష భేదం లేకుండా నేలకొరిగిన అమరులున్నారు. ఆనాడు జరిగిన తెలంగాణ విముక్తి ఉద్యమంలో మెరిసిన అగ్ని కణమే వీరనారి చాకలి ఐలమ్మ. నిజాం నిరంకుశ పాలన నుండి విముక్తి పొందేందుకు సాగుతున్న పోరు ఐలమ్మ రాకతో భూమి కోసం, భుక్తి కోసం రైతాంగ సాయుధ పోరాటంగా రూపుదాల్చింది. తెలంగాణ సాయుధ పోరాటానికి దిశానిర్దేశం కల్పించి సాయుధ పోరాటాన్ని చరిత్రలో చిరస్థాయిగా నిలిపిన వీరవనిత ఐలమ్మ.

వ్యవసాయక విప్లవం రగిలించిన అగ్నికణం చాకలి ఐలమ్మ స్త్రీ జాతికి ఆదర్శనీయం.ఆమె జీవితం మహిళా లోకానికి మార్గదర్శకం.ఆమె పోరాట స్ఫూర్తి, దేశ్ ముఖ్ ను ఎదిరించిన వైనం మహిళా శక్తికి స్ఫూర్తిదాయకం.

చిట్యాల ఐలమ్మ ఉమ్మడి వరంగల్ జిల్లా రాయపర్తి మండలం పాలకుర్తి నియోజకవర్గంలోని కిష్టాపురం గ్రామంలో సాధారణ రజక కుంటుంబంలో జన్మించింది. అతిపిన్న వయస్సులోనే పాలకుర్తి గ్రామానికి చెందిన చిట్యాల నర్సింహతో వివాహం జరిగింది. వీరికి ఐదుగురు సంతానం. కులవృత్తి చేసుకుంటూ జీవిస్తున్న తరుణంలో పాలకుర్తిలో ఆంధ్రమహాసభ ఏర్పడింది. 1944లో భువనగిరిలో రావి నారాయణ రెడ్డి స్థాపించిన ఆంధ్ర మహాసభ దేవరుప్పుల మండలం కడివెండిలో అదే ఏటా ఏర్పడింది. నల్ల నరసింహులు, ఆరుట్ల రామచంద్రారెడ్డి తదితర నాయకులు పాలకుర్తి కేంద్రంగా 1945లో ఆంధ్ర మహాసభను ఏర్పరిచారు. ఐల్లమ్మతోపాటు అనోతోజు బ్రహ్మయ్య , జీడి సోమనర్సయ్య , మామిండ్ల మల్లయ్య, మామిండ్ల కోంరయ్య , చుక్క సోమయ్య , మామిండ్ల ఐల్లయ్యల ఇంకా మరికొంత మంది యువకులు ఆంధ్ర మహాసభలో చేరారు. ఐలమ్మ ఇల్లే సంఘానికి కేంద్రంగా మారింది. సంఘ నాయకులకు రక్షణ కల్పించడం, భోజన వసతి కల్పించడం ఐలమ్మ పని.

రజాకార్ ఉపసేనాని విస్నూర్ దేశ్ ముఖ్ రాపాక రామచంద్రారెడ్డి ఆయన కుమారుడు జగన్ మోహన్ రెడ్డి ( బాబు దొర )లు 60 గ్రామాలలో ఆడిందే ఆట పాడిందే పాట. ప్రజల మాన ప్రాణాలు దోచుకోవడం, ఎదురు తిరిగిన వారిని హతమార్చడం, తల్లి పాలను పసిపిల్లలకు ఇవ్వకుండా పిండి పారబోయించడం, మహిళలను వివస్త్రలుగా చేసి చుట్టూ కాముడు ఆటలు, పాటలు పాడించడం వంటి హేయమైన పనులు చేసేవారు. రైతుల పంట పొలాలను పశుసంపదను లాక్కోవడం, వెట్టిచాకిరీ చేయించుకోవడం వంటి ఎన్నో అకృత్యాలకు ఒడిగట్టారు. రామచంద్రారెడ్డి కుమారుడు బాబుదొర గ్రామ గ్రామాన ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని గృహ దహనాలు, లూటీలు చేయడం పనిగా పెట్టుకునే వాడు. తనకు రక్షణగా ఖాసిం రజ్వీ నాయకత్వాన ఉన్న రజాకార సేనలను పోషిస్తూ విస్నూరులో పోలీసు ఠాణాను నెలకొల్పుకున్నాడు. ఈ క్రమంలో దేశ్ ముఖ్ రామచంద్రారెడ్డి బాధలు భరించిన ప్రజలకు ఆంధ్రమహాసభ ఎడారిలో ఒయాసిస్సులా కన్పించింది. ఆంధ్ర మహాసభను ప్రజలు ఆదరించడం మొదలుపెట్టారు. విస్నూరు దేశ్ ముఖ్ ఆంధ్ర మహాసభను అంతం చేయాలని పంతం పట్టారు.



ఈ క్రమంలో 1945 ఫిబ్రవరిలో పాలకుర్తి జాతర వచ్చింది. ఈ జాతర సందర్భంగా సంఘం ప్రచారం చేపట్టాలని ఆంధ్రమహాసభ పాలకుర్తి దళం ఆర్గనైజర్ చకిలం యాదగిరిరావు అనుకున్నారు. బహిరంగ సభ ఏర్పాటుకు సంఘం కార్యకర్తలతో చర్చించి కేంద్ర కమిటీకి తెలపడంతో బహిరంగ సభకు ఆరుట్ల రామచంద్రారెడ్డి నిజాం ప్రభుత్వం నుంచి అనుమతి పొందారు. బహిరంగ సభను పాలకుర్తిలో ఏర్పాటు చేశారు. బహిరంగ సభ జయప్రదం అయితే తన పరువు పోతుందని భయపడిన దేశ్ ముఖ్ రామచంద్రారెడ్డి సభను భగ్నం చేసి ఆరుట్ల రామచంద్రారెడ్డని చంపాలని 60 మంది గూండాలను పాలకుర్తికి పంపాడు. రామచంద్రారెడ్డిని చంపేందుకు ఆ గూండాలు స్వైర విహారం చేశారు. దీంతో బహిరంగ సభకు పోలీసు రక్షణ అడిగితే దేశ్ ముఖ్ తో కుమ్ముక్కైన పోలీస్ అధికారి బందోబస్తుకు నిరాకరించారు. దీంతో ఆరుట్ రామచంద్రారెడ్డి బహిరంగ సభ రద్దు చేసుకున్నారు.

సభ రద్దును సంఘం కార్యకర్తలకు తెలిపేందుకు ఆరుట్ల వాలంటీర్ల రక్షణలో ఓ ఇంటిలో ఉండగా రాత్రి 9 గంటల సమయంలో ఓనమాల వెంకని నాయకత్వంలో గూండాలు ఆరుట్ల పై దాడికి ప్రయత్నించారు. దీన్ని పసిగట్టిన సంఘం కార్యకర్తలు గూండాలపై ఎదురుదాడికి దిగగా వనమా వెంకని తలపగిలి గూండాలు పలాయనం చిత్తగించారు. ఈ దాడిపైన సంఘం కార్యకర్తలైన ఐలమ్మ భర్త నర్సింహ్మ, కొడుకులు సోమయ్య ,లచ్చయ్య, ముత్తిలిగం, ఆరుట్ల రామచంద్రారెడ్డి, డి.సుబ్బారావు, గంగుల సాయిరెడ్డి, మనోహర్ రాపు, కడవెండి ఎర్రమరెడ్డి, కోదండ రాంరెడ్డి , నల్ల నర్సింహులు, అనోతోజు బ్రహ్మయ్యతో పాటు 12మంది పై విస్నూరు పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇందులో 10మందిని పోలీసులు అరెస్టు చేసి విస్నూరు పోలిసుస్టేషన్ కు తరలించారు. సుబ్బారావు, ఆరుట్ల రామచంద్రారెడ్డి పాలకుర్తి ప్రాంతంలోని కొండాపురంలో గల గిరిజన ఇండ్లల్లో తలదాచుకున్నారు.

సంఘానికి అండదండలు అందించిన ఐలమ్మ కుటుంబాన్ని పాలకుర్తిలో లేకుండా చేసేందుకు దేశ్ ముఖ్ వ్యూహం పన్నిండు. పాలకుర్తి పట్వారి శేషగిరిరావును దేశ్ ముఖ్ ఏజెంటుగా ఏర్పాటు చేసుకొని ఐల్లమ్మ కుటుంబంపైకి ఉసి గొల్పిండు. దేశ్ ముఖ్ అండతో విర్రవీగిన శేషగిరిరావు ఐల్లమ్మ కుంటుంబాన్ని పొలం దున్నేందుకు నాగళ్ళను పంపమనగా అందుకు ఆమె తిరస్కరించింది . దీంతో రెచ్చిపోయిన శేషగిరిరావు పాలకుర్తిలో సంఘం లేకుండా చేస్తానని సంఘం కార్యకర్తల ఇండ్లు దున్ని విత్తనాలు వేస్తానని గ్రామాన్ని తగలబెడ్తానని ప్రతిజ్ఞ చేసిండు. దీంతో ఆగ్రహోదగ్రులైన సంఘం కార్యకర్తలు దేశ్ ముఖ్ ఏజెంట్ ఇళ్ళను గునపాలతో పొడిచి నేల మట్టం చేశారు. ఇళ్ళు దున్ని మొక్కజొన్న విత్తనాలు వేసి నాలుగు నెలల తర్వాత మొక్క జొన్న కంకులను గ్రామస్తులందరూ మూకుమ్మడిగా మంటల్లో కాల్చుకుతిని దేశ్ ముఖ్ కు తగిన గుణపాఠం నేర్పారు. దీంతో ఐలమ్మ కుటుంబంపై మరింత పగ పెంచుకున్న దేశ్ ముఖ్ అదను కోసం వేచి చూస్తున్నాడు.

ఐలమ్మ కుటుంబం కులవృత్తి తోపాటు మల్లంపల్లి గ్రామానికి చెందిన కొండలరావుకు పాలకుర్తిలో ఉన్న వ్యవసాయ భూములను కౌలుకు తీసుకొని పంట పండించేది. పంట కోతకు వచ్చిన సమయంలో దేశ్ ముఖ్ ఏజెంట్ శేషగిరిరావును రంగంలోకి దింపాడు . పంట పొలాన్ని స్వాధీనం చేసుకునేందుకు మల్లంపల్లి కొండల్ రావును దేశ్ ముఖ్ దగ్గరకు పిలిపించి ఐలమ్మ వ్యవసాయ భూములను అక్రమంగా కౌలుకు తీసుకున్నట్లు ఆయన చేత బలవంతంగా ఒప్పించారు. వ్యవసాయ భూములు మావే అంటూ విస్నూర్ దేశ్ ముఖ్ రజాకార్ గూండాలను పొలం కోసుకురమ్మంటూ పురమాయించాడు. దీన్ని గ్రహించిన ఐలమ్మ ఆంధ్రమహాసభ కేంద్ర కమిటీకి తెలిపింది. దీంతో చకిలం యాదగిరిరావు, దేవులపల్లి వెంకటేశ్వరరావుతో చర్చించి పంట కాపాడేందుకు భీమిరెడ్డి నరసింహారెడ్డి, నల్ల ప్రతాప్ రెడ్డి , ఆరుట్ల రామచంద్రా రెడ్డిలను సూర్యాపేట నుంచి పాలకుర్తి పంపారు.

భీమిరెడ్డి నరసింహారెడ్డి మరో 15 మందిని వెంటబెట్టుకుని పొలం వద్ద మాటు వేసారు. ఇంతలో దేశ్ ముఖ్ గూండాలు పంట కోసుకునేందుకు వచ్చారు. దీంతో సంఘం నాయకులు ఓ చేతిలో కొడవళ్లు, మరో చేతిలో కర్రలతో రజాకార్ గుండాలను ఎదిరించి పోరాడారు. ఓ వైపు పోరాడుతూనే పంటను కోసి కట్టలు కట్టి ఐలమ్మ ఇంటికి చేర్చారు. దీంతో దేశ్ ముఖ్ ఆగ్రహోదుగ్రుడై కేసులు పెట్టాడు ... పోలీసులు సంఘం నాయకులను, ఐలమ్మ కుటుంబీకులను అరెస్టు చేసి చిత్రహింసలకు గురిచేశారు. అయినా ఐలమ్మ చలించకుండా మొక్కవోని ధైర్యంతో సంఘం వెంట ఉండి పోయింది. ఆమె భర్తను, కొడుకులను దేశ్ ముఖ్, రజాకార్లు , పోలీసులు అడుగడుగునా హింసించినా ఏనాడు వెనకడుగు వేయలేదు. దేశ్ ముఖ్ ఆగడాలకు నీ బాంచన్ దొరా ...కాల్మోకుత అని అన్న రోజుల్లోను ఐలమ్మ ఏనాడు ప్రాధేయపడిన పాపాన పోలేదు. కమ్యూనిస్టు యోధులు పుచ్చలపల్లి సుందరయ్య, నల్ల నరసింహులు తెలంగాణ సాయుధ పోరాట అనుభవాలను, ఐలమ్మ పోరాటాన్ని వారి పుస్తకాలలో ప్రముఖంగా పేర్కొన్నారు .

రాష్ట్ర ప్రభుత్వం చాకలి ఐలమ్మ వర్ధంతి, జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహించడం నిజంగా హర్షణీయం. యావత్ రజక జాతి తరుపున రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

– ఆలేటి రమేశ్
రజక విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.
9948798982.

# తెలంగాణ తెగువను ప్రపంచానికి చాటి చెప్పిన చకలి ఐలమ్మ

- వేట్టి చాకిరీ విముక్తి కోసం భూమి విముక్తి కోసం స్వేచ్ఛ సమానత్వం కోసం పోరాడిన దిరవణిత.
- తుడుం దెబ్బ ఆధ్వర్యంలో చకలి ఐలమ్మ వర్ధంతి

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా శుభ తెలంగాణ :**ఆదిలాబాద్ జిల్లా// జిల్లా కేంద్రంలోని రిమ్స్ హాస్పిటల్స్ ముందర ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహాన్నికి పూల దండలు వేసి ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ ఆధ్వర్యంలో ఘనంగా నివాళ్ళు అర్పించారు.

తుడుం దెబ్బ ఆదిలాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చకలి ఐలమ్మ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. విగ్రహాన్నికి పూలమాలలు వేసి నీవాళు అర్పించారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షులు గోదం గణేష్ మాట్లాడుతూ తెలంగాణ తెగువను ప్రపంచానికి చాటి చెప్పిన చకలి ఐలమ్మ వేట్టి చాకిరీ విముక్తి కోసం భూమి బుక్తి విముక్తి కోసం స్వేచ్ఛ సమానత్వం కోసం పోరాడిన దిరవణిత. అగ్రకులాల స్త్రీలు, దొరసానులు తమను కూడా 'దొరా' అని ఉత్పత్తికులాల పిలుపించుకొనే సంస్కృతికి చరమగీతం పాడినవారిలో ఐలమ్మ ముందంజలో ఉన్నారు. దొరా అని పిలువకపోతే ఉన్నతకులాలతో పాటు వారి అనుంగు ఉంపుడుకత్తెలలో కూడా ఉన్న రాక్షస ప్రవృత్తి అనేక పీడన రూపాలలో బయటకు వచ్చేది. వెనుకబడిన కులాల మీద ఆ పీడన రూపాలు విరుచుకుపడేవి. తమను దొరా అని పిలువని ఉత్పత్తి కులాల స్త్రీల మీద తమ భర్తలను ఉసిగొల్పి, దగ్గరుండి ఆఘాయిత్యం చేయించేవారు. ఈ భూమినాది... పండించిన పంటనాది... తీసుకెళ్లడానికి దొరెవ్వడు... నా ప్రాణం పోయాకే ఈ పంట, భూమి మీరు దక్కించుకోగలరు.. అంటూ మాటల్ని తూటాలుగా మల్చుకొని దొరల గుండెల్లో బడబాగ్నిలా రగిలిన తెలంగాణ రెట్కతాంగ విప్లవాగ్ని చాకలి అయిలమ్మ.

మల్లంపల్లి మక్తేధారు ఉత్తమరాజు కొండలరావుకు పాలకుర్తిలో 40 ఎకరాల భూమి ఉండగా ఐలమ్మ కౌలుకు తీసుకుంది. కొండల్ రావు తల్లి జయప్రదా దేవి ఐలమ్మకూ భూమి సాగు చేసుకునేందుకు అనుమతి ఇచ్చింది. ఆ భూమిలో నాలుగు ఎకరాలు సాగుచేశారు. పాలకుర్తి పోలీస్ పటేల్ వీరమనేని శేషగిరిరావుకు ఐలమ్మ కుటుంబానికి విరోధం ఏర్పడింది. జీడి సోమనర్సయ్య నాయకత్వంలో ఆంధ్రమహాసభ ఏర్పడింది. ఐలమ్మ ఆ సంఘంలో సభ్యురాలు.%ళ12ఠ% పాలకుర్తి పోలీస్ పటేల్ శేషగిరిరావు ఐలమ్మను కుటుంబంతో వచ్చి తన పొలంలో పనిచేయాలని ఒత్తిడి చేయడంతో పనిచేయడానికి నిరాకరించింది. పాలకుర్తి పట్వారీ పప్పులుడకక అయిలమ్మ కుటుంబం కమ్యూనిస్టుల్లో చేరిందని విసునూర్ దేశ్‌ముఖ్ రాపాక రాంచంద్రారెడ్డికి ఫిర్యాదు చేశాడు. కేసులో అగ్రనాయకులతో పాటు అయిలమ్మ కుటుంబాన్ని ఇరికించారు. అయినప్పటికీ న్యాయస్థానంలో తీర్పు దేశ్‌ముఖ్‌కు వ్యతిరేకంగా వచ్చింది. అయిలమ్మ కుటుంబాన్ని ఆర్థికంగా దెబ్బతీస్తే సంఘం పట్టు కోల్పోతుందని భావించిన దేశ్‌ముఖ్, పోలీస్ పటేల్ ను పిలిపించుకొని, అయిలమ్మ కౌలుకు తీసుకున్న ఉత్తమరాజు జయప్రదా దేవి భూమిని తన పేరున రాయించుకున్నాడు. భూమి తనదని, పండించిన ధాన్యం తనదేనని పంటను కోసుకురమ్మని వందమందిని దేశ్‌ముఖ్ పంపాడు. ఆంధ్రమహాసభ కార్యకర్తలు వరిని కోసి, వరికట్టం కొట్టి ధాన్యాన్ని ఐలమ్మ ఇంటికి చేర్చారు. భీంరెడ్డి నరసింహారెడ్డి, ఆరుట్ల రాంచంద్రారెడ్డి, చకిలం యాదగిరిలు సైతం ధాన్యపు బస్తాలను భుజాలపై మోసారు. కొండా లక్ష్మణ్ బాపూజీ సహకారంతో ఐలమ్మకు అనుకూలంగా తీర్పువచ్చింది. రజాకార్ల ఉపసేనాధిపతి అయిన దేశ్‌ముఖ్ రెండుసార్లు పరాజయం పాలయ్యాడు. ఐలమ్మ ఇంటిని కూడా తగులబెట్టారు. ధనాన్ని, ధాన్యాన్ని ఎత్తుకెళ్లారు. ఐలమ్మ కూతురు సోమనర్సమ్మపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఐలమ్మ కుమారులు ముగ్గురు, పాలకుర్తి కమ్యునిష్టు నాయకత్వం ఇంటిని కూల్చి అదే స్థలంలో మొక్కజొన్న పంటను పండించారు. అనేక రకాలుగా నష్టపోయినప్పటికీ అయిలమ్మ కుటుంబం ఎర్రజెండాను వీడలేదు.



'ఈ దొరగాడు ఇంతకంటే ఇంక నన్ను ఏవిధంగా నష్టపెట్టగలడు' అని తనలో తాను ప్రశ్నించుకొన్నది. నీ దొరోడు ఏం చేస్తాడ్రా' అని మొక్కవోని ధైట్కర్యంతో రోకలి బండ చేతబూని గూండాలను తరమి కొట్టింది. కాలినడకన వెళ్లి దొరకు సవాలు విసిరింది. అయిలమ్మ భూపోరాటం విజయంతో పాలకుర్తి దొర ఇంటిపై కమ్యూనిస్టులు దాడిచేసి ధాన్యాన్ని ప్రజలకు పంచారు. అలాగే 90 ఎకరాల దొర భూమిని కూడా ప్రజలకు పంచారు. అయిలమ్మ భూపోరాటంతో మొదలుకొని సాయుధ పోరాటం చివరి వరకు నాలుగు వేలమంది ఉత్పత్తి కులాల వారు అమరులయ్యారు. 10 లక్షల ఎకరాల భూమి పంపకం జరిగింది. చాకలి ఐలమ్మ వారసత్వాని పుణికి పుచ్చుకుని నేటి యువత తమ అస్తిత్వం కోసం తమ హక్కుల కోసం స్వేచ్ఛ సమానత్వం కోసం పోరాడాలని కోరుతున్నాం.

ఈ కార్యక్రమంలో పాల్గొన తుడుందేబ్బ జిల్లా అధ్యక్షులు గోడం గణేష్, ఉయ్యక సంజీవ్ తుడుం దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వేట్టి మనోజ్ తుడుం దెబ్బ జిల్లా ప్రచార కార్యదర్శి,

కుడమెత ప్రకాష్ పట్టణ అధ్యక్షులు అదిలాబాద్, ఆత్రం గణపతి మండల అధ్యక్షులు, మావల్ల వేడ్మ ముకుందరావు ప్రధాన కార్యదర్శి మరియు తదితరులు పాల్గొనడం జరిగింది.

# పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం




**శుభ తెలంగాణ :**కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలోనీ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు శాంతియుతంగా పండుగలు జరుపుకోవాలనీ వినాయక చవితి సందర్భంగా గణేష్ మండపాల నిర్వాహకులు మండపాల దగ్గరలో జాగ్రత్తలు తీసుకోవాలని అజాగ్రత్త వహించకూడదని శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ కవిత విజయ్, జెడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి, పిట్లం ఎస్సై విజయ్ కొండ, ఏ ఎస్ఐ లింబాద్రి, పిట్లం మండల సర్పంచుల పురం అధ్యక్షులు నారాయణరెడ్డి సింగిల్ విండో చైర్మన్ శపథం రెడ్డి పిట్లం సర్పంచ్ విజయలక్ష్మి శ్రీనివాస్ రెడ్డి చిన్న కొడుకు సర్పంచ్ కవిత శ్రీనివాస్ రెడ్డి గౌరారం సర్పంచ్ అనసూయ శంకర్ మరియు హిందూ ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# రజక సంఘం ఆధ్వర్యంలో బంగారు మైసమ్మ తల్లికి బోనాలు

- అధిక సంఖ్యలో పాల్గొన్న రజక సంఘం యువత
- ముత్యాలమ్మ తల్లి కి బోనమెత్తిన మహిళలు
- సాంప్రదాయబద్ధంగా ముస్తాబైన రజక మహిళలు



**వలిగొండ శుభ తెలంగాణ :**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని పులిగిల్ల గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో రజకుల కులదైవమైన బంగారు మైసమ్మ దేవి అమ్మవారికి అత్యంత భక్తి శ్రద్ధలతో బోనం నైవేద్యం సమర్పించడం జరిగింది. మహిళలు బోనం కుండ నెత్తిన ఎత్తుకొని, వీధి వీధి తిరుగుతూ దప్పు చప్పుల్ల వాయిద్యాలకు అనుగుణంగా శివ సత్తుల పూనకాలతో ఆ ప్రాంతమంతా అమ్మవారి స్మరణతో మారుమోగింది. సంప్రదాయబద్ధంగా తయారైన మహిళలు నెత్తిన బోనం ఎత్తి భజంత్రీలతో ఊరేగింపుగా తరలి వెళ్లి అమ్మ వార్లకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఏడాది అంతా కూడా వర్షాలు విస్తారంగా కురిసి రైతులు ధన ధాన్యాలతో భోగభాగ్యాలతో కలిసి వెళ్లాలని అమ్మవారిని కోరుకున్నారు.ఇట్టి కార్యక్రమంలో ప్రజల సంఘం గ్రామ పెద్దలు యువకులు మహిళలు తదితరులు పాల్గొనడం జరిగింది.

# అంగరంగ వైభవంగా పెద్దమ్మతల్లి బోనాలు



**శుభ తెలంగాణ :**చింతపల్లి మండల కేంద్రంలోని శ్రీ కృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెద్దమ్మ తల్లి బోనాల కార్యక్రమంలో మహిళలు బోనాల తోటి ఊరేగించారు ఈ కార్యక్రమంలో శివర్ల రమేష్. గ్రామ పెద్దలు పాల్గొని బోనాలను ఘనంగా నిర్వహించారు శివర్ల రమేష్ మాట్లాడుతూ...ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి .దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుంది అన్నారు.ప్రజలు అందరు సుఖ సంతోషాలతో ఉండాలి .ప్రజలు మంచి ఆరోగ్యంతో ఉండేలా చూడాలని పెద్దమ్మ తల్లిని వేడుకున్నారు

# నిండుకుండలా సింగూర్ ప్రాజెక్టు



**పుల్కల్ శుభ తెలంగాణ :**మెదక్ జిల్లాలోని అతిపెద్ద ప్రాజెక్టు అయిన సింగూర్ ప్రాజెక్టుకు నాలుగు రోజులుగా కురుస్తున్నటువంటి భారీ వర్షాల కారణంగా ఎగువ నుండి 3248 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా దిగువకు 3248 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి నిల్వమట్టం 29.917 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం 29.211 టీఎంసీలకు గాను నిండినది.జెన్కో దారా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారని ఆ శాఖ అధికారులు తెలిపారు.

శుభ తెలంగాణ
TELTEL/2017/72695
ఉన్నది ఉన్నట్లుగా రాసే తెలుగు దినపత్రిక
సోమవారం | మేడ్చల్
11 సెప్టెంబర్ 2023
www.subhatelangana.in



# నేటికీ సమాజాన్ని నడిపిస్తున్నది నాటి మహా పురాణ ధర్మాచరణమే

● రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు



**శుభ తెలంగాణ :**మన పురాణాలలోని సామాజిక తాత్వికత అమూల్యమైనది .
-విద్యావేత్త ఎమ్మెల్సీ సురభి వాణిదేవి.
మన పురాణాలలోని ఇతిహాసాలు నేటికీ మానవ సమాజం మనుగడకు, ధర్మాచరణకు పట్టుకొమ్మలుగా నిలుస్తున్నాయని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు అన్నారు .అష్టాదశ పురాణాలు శ్రీ మదగ్ని, శ్రీ నారద ,శ్రీ మార్కండేయ, శ్రీ వరాహ, శ్రీవామన,. శ్రీ వాయు, శ్రీ విష్ణు, శ్రీ భాగవతం ..ఇలా ఒక్కొక్క పురాణం మానవాళిని రుజువర్తనతో, భక్తితో, నిజాయితీ -నిబద్ధతతో జీవనశైలిని కొనసాగించడానికి దోహదం చేస్తూనే ఉన్నాయని డాక్టర్ వకుళాభరణం పేర్కొన్నారు. ఆదివారం నాడు విశ్వసాహితి ఆధ్వర్యంలో డాక్టర్ బ్రాహ్మణపల్లి జయరాములు సభాధ్యక్షతన "నాటి పురాణం నేటి సమాజం" గ్రంథావిష్కరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు పాల్గొని గ్రంధాలను ఆవిష్కరించారు.
ప్రధాన వక్తగా ఎమ్మెలసీ సురభి వాణీదేవి పాల్గొన్నారు.గ్రంధం ఒక భాగం ను , భాగంను సర్వార్ధ సంక్షేమ సమితి అధ్యక్షులు, మాజీ ప్రధానమంత్రి పీ.వీ నరసింహారావు సోదరులు పి.వి. మనోహర్ రావుకు, రెండవ భాగమును వాడపల్లి రాజ్యలక్ష్మికి అంకితం ఇచ్చారు. కార్యక్రమం స్థానిక నాగోల్ స్నేహపురి కాలనీ శ్రీ శ్రీ గోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో జరిగింది. ఈ గ్రంథాల ఆవిష్కరణ -అంకితోత్సవం కార్యక్రమంలో, దేవాలయం చైర్మన్ వారణాసి వంశీ, విద్యావేత్తలు, కవులు రచయితలు ఆచార్య టి .గౌరీశంకర్, డాక్టర్ వై .రమాప్రభ, ఆచార్య కడారి సత్యమూర్తి, వైయస్సార్ మూర్తి ,వి. జనార్దన్ రావు, గొల్లపూడి పద్మావతి, తంగిరాల చక్రవర్తి ,దుర్గాప్రసన్నలు పాల్గొని ప్రసంగించారు.గ్రంధావిష్కరణ సభలో
డాక్టర్ వకుళాభరణం ప్రసంగిస్తూ...మహాపురాణాలలో మనిషిని కేంద్రంగా, ప్రతి అంగం కు సూచికగా ఒక్కో పురాణం ఆవిష్కృతమైనది అన్నారు. మానవాళి మనుగడలో పురాణాల పాత్ర కీలకమైంది అన్నారు. ఈ పురాణాలలో సామాజిక అంశాలు మహోన్నతమైనవి అన్నారు. ఈ అంశాల ఆచరణ వలననే మానవజాతి గొప్ప జీవన విధానంలో నాగరికంగా జీవించగలుగుతున్నది అన్నారు. ఎమ్మెల్సీ సురభి వాణిదేవి ప్రసంగిస్తూ.... ఋషులు ,మునులు ఏళ్ల తరబడిగా తపస్సులు చేసి సాధించిన దైవిక బలంతో పురాణాలు రచించారన్నారు. మన పురాణాలు అన్నీ ధర్మాన్ని బోధించాయని, దైవాన్ని దగ్గర చేశాయని అన్నారు. అంతకుముందు శ్రీకృష్ణ గానామృతం పేరిట శ్రీమతి పద్మావతి బృందం, నైవేలి జ్ఞానాంబాళ్ ,పి. వాణి కుమారి, తులజ, ప్రత్యూష ,శారదా సాగరి ,చిలకమర్రి హరిచరణ్, బలరాం మున్నగు బృందాలు భక్తి గీతాలాపనలు చేశాయి. ఈ కార్యక్రమాల్ని శ్రావణి, విశ్వసాహితి, సమ్మోహన, గాయత్రి, ప్రియ జనని, ఏ .బి .బి .ఎస్ .ఎస్ సంగీత సాహిత్య, సాంస్కృతిక సంస్థలు సంయుక్తంగా నిర్వహించాయి. నేటి ఈ కార్యక్రమాలు దైవికంగా, ఆధ్యాత్మికంగా, భక్తజన సందోహంతో వీనులకు విందుగా, కన్నులకు పండుగగా కొనసాగాయి.

## అంగరంగ వైభవంగా పోచమ్మ తల్లి బోనాలు...

● డప్పు చప్పుళ్లు.. శివసత్తుల పూనకాలు..



**శుభ తెలంగాణ :**జనగామ నియోజకవర్గం బచ్చన్నపేట మండలంలోని ఇటికాలపల్లి గ్రామస్తులు అంగరంగ వైభవంగా పోచమ్మ తల్లి బోనాలను ఆదివారం రోజున ఘనంగా నిర్వహించారు.ముందుగా గ్రామ దేవతలకు పూజలు చేసారు.మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకుని డప్పు చప్పుళ్ల మధ్య శివసత్తుల పూనకాలతో ముందుకు సాగారు. ఊరంత చల్లగా, పాడి పంటలు బాగుండాలని, అందరూ ఆరోగ్యంగా ఉండాలని పోచమ్మ దేవతలకు మొక్కులు తీర్చుకున్నారు. కోళ్లు, గొర్రెలను అమ్మవారికి బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు...

## తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ సేవలు మరువలేనివి

● అధ్యక్షులు మంగళ పెల్లి హుస్సేన్
● చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న నేషనల్ హ్యూమన్ రైట్స్ సభ్యులు



**తొర్రూర్ డివిజన్ శుభ తెలంగాణ :**నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ వర్ధంతి సభలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన అధ్యక్షుడు మంగళ పెల్లి హుస్సేన్ చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం విముక్తి కోసం మహిళ చాకలి ఐలమ్మని కొనియాడారు, ప్రతి ఒక్కరు హక్కుల కోసం పోరాటం ద్వారా సాధించి ముందుకు వెళ్లాలని అన్నారు చాకలి ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో జిల్లా బాధ్యులు తల్లూరి శ్రీనివాసు, అబ్బు రాములు, ప్రభాకర్,బుక్య సురేష్ మహబూబాబాద్ జిల్లా, ప్రభాకర్, వెంటేశ్వర్ల,తదితరులు పాల్గొన్నారు,

## ఆల్విన్ కాలనీ డివిజన్ కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం లో పాల్గొన్న మాజీ శాసనసభ్యులు బిక్షపతి యాదవ్

● రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్...
● పార్టీలకు అతీతంగా ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న కాలనీ అసోసియేషన్ సభ్యులు
● నాటికి -నేటికి ప్రజల మధ్యలోనే ఉండి ప్రజా శ్రేయస్సు కోరుకునే వ్యక్తి మాజీ శాసనసభ్యులు బిక్షపతి యాదవ్
● తండ్రి చూపిన బాటలో నడుస్తూ ... ప్రజాసేవ చేస్తూ అభివృద్ధి ధ్యేయంగా, శేరిలింగంపల్లి నియోజకవర్గం నుండి బరిలో ఉ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్




**శుభ తెలంగాణ :**ఈరోజు ఆల్విన్ కాలనీ డివిజన్ 124 డివిజన్ గోదా కృష్ణ ఫంక్షన్ హాల్ లో మాజీ శాసనసభ్యులు బిక్షపతి యాదవ్ ఆత్మీయ సమ్మేళనం జరిపారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతోమంది కార్యకర్తలకు తమవంతుగా సహాయ సహకారాలు అందించమని తెలుపుతూ. నేను చూపిన బాటలో తమ తనయుడు రవి కుమార్ యాదవ్ కూడా ప్రజలకు సేవ చెయ్యాలని సదుద్దేశంతో రాజకీయాలలోకి వచ్చారని అందుకు మీ ఆశీర్వాదాలు రవి కుమార్ యాదవ్ కి కావాలని కోరారు..
ఈ సందర్భంగా రవి కుమార్ యాదవ్ మాట్లాడుతూ గతంలో తండ్రి బిక్షపతి యాదవ్ చూపిన బాటలో నడుస్తూ నాయకులు ,కార్యకర్తల సూచన మేరకు నడుచుకొని నియోజకవర్గం అభివృద్ధి చేస్తానని రేపు జరగబోయే సాధారణ ఎన్నికలలో మీ అందరి ఆశీర్వాదాలు నాపై ఉండాలని అభ్యర్థించారు ఈ కార్యక్రమంలో ఇస్మాయిల్ సాబ్, వెంకటస్వామి రెడ్డి ,జానకి రామరాజు,నరసింహ చారి ,నర్సింగ్ యాదవ్, రామరాజు, కుమార్ యాదవ్, కృష్ణ గౌడ్ ,రామ్ రెడ్డి, విమల, సుశీల, దేవి రెడ్డి ,స్వప్న మొదలగు వారు పాల్గొన్నారు.

## రాంపూర్ లో ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు..



**శుభ తెలంగాణ ::** కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని రాంపూర్ గ్రామంలోనీ గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని ఆమె నివసించి పోరాడిన గడ్డ పాలకుర్తిలో వీర వనిత విగ్రహానికి గ్రామ సర్పంచ్ పూలమాలవేసి నివాళు లు అర్పించారు అనంతరం యాకూబ్ మాట్లాడుతూ ఐలమ్మ 1895లో వరంగల్ జిల్లా కిష్టాపురంలో చాకలి కుటుంబంలో ఓరుగంటి మల్లమ్మ సాయిలు దంపతులకు జన్మించి పది, పదకొండేళ్ల వయసులో పాలకుర్తికి చెందిన చిట్యాల నరసింహను వివాహం చేసుకొని పదిహేనేళ్లకు కాపురానికి పాలకుర్తికి వచ్చింది అన్నారు. కులవృత్తి బట్టలు ఉతకటం, వృత్తి మాన్యంగా లభించిన నాలుగుమళ్ల భూమిసాగు చేయటం వాళ్లకు బతుకు తెరువు మార్గాలు.మరియు రజాకర్లను ఎదురించి భూమికోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన వీరవనిత ఆమెను స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు.
ఒక వైపు మా దేశాన్ని వదిలివెళ్ళండి అంటూ భారతదేశ ప్రజలు బ్రిటిష్ వారికీ వ్యతిరేకంగా క్విట్ ఇండియా ఉద్యమం నిర్వహిస్తున్న కాలంలో మా భూములను వదిలి వెళ్ళండి అంటూ ఐలమ్మ వంటివాళ్లు దేశీయ భూస్వామ్య పెత్తందారీతనానికి వ్యతిరేకంగా దేశంలో ఎక్కడెక్కడో బతుకు స్వాతంత్ర్యం కోసం పోరాటాలు చేశారు. నాటి పోరాటాలు నేటి యువ సమాజానికి ఆదర్శప్రాయము అన్నారు.
ఈకార్యక్రమంలో పిట్లం సర్పంచుల ఫోరం అధ్యక్షులు రాంపూర్ గ్రామ సర్పంచ్ మందడి నారాయణరెడ్డి, గౌరారం సర్పంచ్ అనసూయ శంకర్, గౌరారం తాండ సర్పంచ్ రవి, బిఆర్ఎస్ నాయకులు రాజిరెడ్డి, అనంత్ రెడ్డి, బాల్ రెడ్డి, రజక సంఘం సభ్యులు, శంకర్, బాలయ్య, మైసయ్య, రమేష్ ,తదితరులు పాల్గొన్నారు.

## బయ్యారం, రంగాపురం లో ఘనంగా శ్రీ ముత్యాలమ్మ బోనాలు

**శుభ తెలంగాణ :**మహబూబాబాద్ జిల్లా బయ్యారం:.. మండల కేంద్రంలో బయ్యారం, రంగాపురం లో ముత్యాలమ్మ పండగ సందర్భంగా ముత్యాలమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ముత్యాలమ్మ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి ముత్యాలమ్మకు అభిషేక కార్యక్రమం నిర్వహించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం బోనాలు సమర్పించి బండ్లు, ట్రాక్టర్స్, కార్లు, జెసిపిలు, ఆటోలు, బైకులు, గుడి చుట్టూ తిప్పి ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో ఉండాలని పాడి పంటలు చల్లగా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో



గ్రామ పెద్దలు ప్రముఖులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు....

## ఘనంగా చాకలి ఐలమ్మ 38వ వర్ధంతి..

● నివాళులర్పించిన మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న రామ్మోహన్ గౌడ్..




**ఎల్బీనగర్, శుభ తెలంగాణ :**తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 38వ వర్ధంతి సందర్భంగా ఎల్బీనగర్ చింతలకుంట చెక్ పోస్ట్ వద్ద గల ఐలమ్మ విగ్రహానికి బిఎన్ రెడ్డి డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న రామ్మోహన్ గౌడ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ.. ఆనాటి నిజాం సంస్థానంలో తెలంగాణ భాగంగా ఉండేది 1940 లలో దొరలు, దేశ్ ముఖ్ లు, దేశ్ పాండేలు, భూస్వాములు, పెత్తందార్లు, నిజాం రాజుకు కప్పం కడుతూ గ్రామాలపై అధికారం చలాయించేవారు. ప్రజలను వివిధ రకాల పన్నుల పేరుతో పీడించడం, వెట్టి చాకిరి చేయించడం చేసేవారు అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, దోపిడీ, పీడన నుంచి విముక్తి కోసం జరిగిన ఆనాటి సాయుధ రైతాంగ పోరాటంలో దొరల గడీలను చాకలి ఐలమ్మ గడగడలాడించిన్న వీర వనిత అని అన్నారు. ఈ కార్యక్రమంలో చాకలి ఐలమ్మ ఐక్యవేదిక అధ్యక్షులు నరసింహ్మ, ప్రధాన కార్యదర్శి చంద్రయ్య, సహాయకార్యదర్శులు యాదగిరి, అంజయ్య, ఉపాధ్యక్షులు సాయిలు, శ్రీనివాస్, కోశాధికారి శ్రీరామ్, మల్లేష్, వెంకటేష్, ఈశ్వర్, అంజయ్య, కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాబోయే ఎన్నికల్లో మా పూర్తి మద్దతు మీకే ఉంటుంది అని, మిమ్మల్ని అఖండ మెజారిటీతో గెలిపించుకుంటాం అని ముక్త కంఠం తో తెలిపిన సంకల్ప్ & లైఫ్ అపార్ట్మెంట్ వాసులు



**శుభ తెలంగాణ :** ఆత్మీయ సమావేశంలో ప్రభుత్వ విప్ గాంధీ కి అపూర్వ స్వాగతం పలికిన సంకల్ప్ %డ% లైఫ్ అపార్ట్మెంట్ వాసులు మాదాపూర్ డివిజన్ పరిధిలోని వసంత సిటీ రోడ్డు లో గల సంకల్ప్ %డ% లైఫ్ అపార్ట్మెంట్ వాసులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొని వారి కాలనీ లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పై ప్రసంగించిన ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ.
ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో మా పూర్తి మద్దతు మీకే ఉంటుంది అని, మిమ్మల్ని అఖండ మెజారిటీతో గెలిపించుకుంటాం అని ప్రభుత్వ విప్ గాంధీ కి ముక్తకంఠంతో తెలియచేసారు. అదేవిధంగా మా కాలనీ లో మంజీర మంచి నీటి వసతి కలిపించినందుకు ప్రత్యేక కృత్ఞతలు తెలియచేస్తున్నాం అని, రోడ్లు, డ్రైనేజి, విధిదీపాలు వంటి మౌలిక వసతులు కలిపించనదుకు సంతోషంగా ఉంది అని కాలనీ వాసులు తెలియచేసారు.ప్రభుత్వ విప్ గాంధీ ని ప్రత్యేకంగా సన్మానించడం జరిగినది. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గాంధీ మాట్లాడుతూ నా పై చూపిన ప్రేమ ,ఆధారభిమానులకు ధన్యుడిని , నా పై మరింత బాధ్యత పెంచారు అని ,మీకు అన్ని విధాలుగా ఎల్లవేళలా అండగా ఉంటానని ప్రభుత్వ విప్ గాంధీ తెలియచేసారు. ఏ చిన్న సమస్య అయిన నా దృష్టికి తీసుకువస్తే తప్పకుండ పరిష్కరిస్తామని ప్రభుత్వ విప్ గాంధీ తెలియచేసారు. అదేవిధంగా
కాలనీ లో నెలకొన్న అన్ని సమస్యలను దశల వారిగా పరిష్కరిస్తామని, కాలనీ లో అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్లను త్వరితగతిన పూర్తి చేస్తామని,మంజీర మంచీ నీటి వసతిని త్వరలోనే కలిపిస్తామని దశల వారిగా అన్ని పనులు పూర్తి చేసి చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామని ప్రభుత్వ విప్ గాంధీ పేర్కొన్నారు. అదేవిధంగా కాలనీ లలో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని , ప్రజలకు స్వచ్ఛమైన, చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామని ప్రభుత్వ విప్ గాంధీ గారు చెప్పడం జరిగినది. నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ,అన్నివేళలో ప్రజలకు అందుబాటులోకి ఉంటానని ,మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని ,నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ప్రభుత్వ విప్ గాంధీ పునరుద్ఘాటించారు.
ఈ కార్యక్రమంలో సంకల్ప్ %డ% లైఫ్ అపార్ట్మెంట్ వాసులు సుందర్ రావు ,మారుతి, ప్రసాద్ ,మురలీధర్, చైతన్య, రాము మరియు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## పులిగిల్లలో అమ్మవార్లకు బోనాలు సమర్పణ



**వలిగొండ శుభ తెలంగాణ :**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని పులిగిల్ల గ్రామంలో తెలంగాణలో సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలయమైన బోనాల పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించుకోవడం జరిగింది. ఈ బోనాల పండుగ సందర్భంగా మహిళలు సంప్రదాయబద్ధంగా ముస్తాబై ప్రత్యేకంగా ఆకర్షణ గా నిలుస్తూ బోనంకుండలో నైవేద్యం వండి రంగురంగుల కలర్లతో తీర్చిదిద్ది నెత్తిన ఎత్తి ,డప్పు చప్పుళ్ల మధ్య శివశక్తుల ముత్యాలతో గ్రామంలోని చిన్న పెద్ద అంతా అంగరంగ వైభవంగా గ్రామంలోని ప్రధాన కచేరి వద్దకు వచ్చి గుంపుగా వెళ్లి అమ్మవార్లకు బోనాలు నైవేద్యం సమర్పించుకోవడం జరుగుతుంది. సంవత్సరానికి ఒకసారి జరిపే ఈ పండుగకు ప్రత్యేక విలువ ఉంటుంది. అమ్మ మా ఊరు చల్లంగా చూడు తల్లి మా పాడిపంటలు వర్ధిల్లేటట్లు చూడు తల్లి అంటూ మహిళలు అమ్మవారిని వేడుకోవడం జరుగుతుంది.

# మెరుగైన వైద్య సేవలందించాలి

- ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్ ఉషా దయాకర్ రావు



**తొర్రూర్ డివిజన్ శుభ తెలంగాణ :**గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రుల నిర్వాహకులు కృషి చేయాలని ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్ ఉషా దయాకర్ రావు అన్నారు. డివిజన్ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన సుప్రిత హాస్పిటల్ ను హాస్పిటల్ వైద్యులు డా.ఎన్ వెంకన్న నాయక్, డాక్టర్ సుప్రితల సమక్షంలో ఉషా దయాకర్ రావు ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ....
గ్రామీణ ప్రాంతాల్లో కార్పొరేట్ స్థాయి ఆసుపత్రులు అందుబాటులోకి రావడం, నాణ్యమైన వైద్యం ప్రజలకు అందడం గర్వకారణమని తెలిపారు. గతంలో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్, హనుమకొండ, వరంగల్ వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని.. ఇప్పుడు తొర్రూరు వంటి ప్రాంతాల్లో సైతం నాణ్యమైన వైద్యం అందుతుందని గుర్తు చేశారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ఆసుపత్రులు కృషి చేయాలని కోరారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాలకుర్తి నియోజకవర్గాన్ని మెడికల్ హబ్ గా మార్చేందుకు కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. ప్రజలు ఆరోగ్యాలను కాపాడుకోవాలని సూచించారు. వైద్యుల సూచనలు పాటిస్తూ ఆయుష్షును పెంచుకోవాలన్నారు. ఈ ప్రాంతానికి చెందిన వైద్యులు సుప్రిత హాస్పిటల్ పేరిట తొర్రూరులో ఆసుపత్రి ని అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, ఏఎంసీ చైర్ పర్సన్ పసుమర్తి శాంత, సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ డా. నాగవాణి, కౌన్సిలర్ గుగులోతు శంకర్, నాయకులు టీకూ నాయక్, భీకూ నాయక్, జాటోతు రమేష్, స్వామి నాయక్, స్థానికులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్తంగా బీజేపీ కే యువత మద్దతు.

- బీజేపీ పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పూసల శ్రీమాన్.



**తొర్రూర్ డివిజన్ శుభ తెలంగాణ :**దేశవ్యాప్తంగా బీజేపి పార్టీకి, భారత ప్రధాని నరేంద్ర మోది కి యువత మద్దతు అధికంగా ఉందని అనేక సర్వేల్లో ఇది స్పష్టమైందని బిజెపి పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్ అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు బచ్చు సురేష్ అధ్యక్షత జరిగిన సమావేశంలో భారతీయ జనతా పార్టీ యువజన విభాగము భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) తొర్రూరు రూరల్ మండల కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల యువ మోర్చా అధ్యక్షులు గా కొండ రాజు (వెంకటాపురం) ప్రధాన కార్యదర్శులు గాబేతమళ్ళ దీపక్ (పోలేపల్లి), కొమ్ము రేవంత్ (వెలికట్ట) ఉపాధ్యక్షులు బండారి సాయి (మాటేడ్) కొమ్ము రాజు (వెలికట్ట) లను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా బిజెవైఎం మండల అధ్యక్షుడు కొండ రాజు మాట్లాడుతూ యువతను సమీకరిస్తూ పార్టీ బలోపేతానికి పనిచేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన బిజెపి జిల్లా అధ్యక్షుడు ఒద్దిరాజు రాం చందర్ రావు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సిరికొండ సంపత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెదగాని సోమయ్య బిజెపి నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్, మండల అధ్యక్షుడు బచ్చు సురేష్ బీజేపీ కార్యదర్శి రచ్చ కుమార్, పైండ్ల రాజేష్, బిజెవైఎం నియోజకవర్గ కన్వీనర్ ఎనగందుల శ్రవణ్ లకు ఈ సందర్బంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా నియోజకవర్గ కో కన్వీనర్ కుమ్మరికుంట్ల శివ ప్రసాద్, పప్పుశెట్టి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# మట్టి గణపతులను పూజించాలి

- ఆర్ బీఎస్ జిల్లా కమిటీ సభ్యుడు కిషోర్ రెడ్డి



**తొర్రూర్ డివిజన్ శుభ తెలంగాణ :**పర్యావరణ హితమైన మట్టి గణపతి విగ్ర హాలను పూజించాలని రైతు బంధు సమితి జిల్లా కమిటీ సభ్యుడు రామసహాయం కిషోర్ రెడ్డి ప్రజలకు పిలుపుని చ్చారు.మట్టి విగ్రహాల రూపకర్త మల్యాల ప్రజాపతి మురళి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మట్టి గణపతుల సముదాయాన్ని ఆదివారం డివిజన్ కేంద్రంలో ఆర్ బీఎస్ జిల్లా కమిటీ సభ్యుడు రామసహాయం కిషోర్ రెడ్డి ప్రారంభించారు.
వివిధ ఆకృతుల్లో తయారుచేసిన మట్టి వినాయక విగ్రహాలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా కిషోర్ రెడ్డి మాట్లాడుతూ.....
వినాయకున్ని మట్టితో తయారు చేసి పూజించడం ద్వారా సత్ఫలితాలు లభిస్తాయని, అందరి ఆకాంక్షలు నెరవేరుతాయని తెలిపారు. మట్టి విగ్రహాలను పూజించడం వల్ల పర్యావరణ సంరక్షణ జరుగుతుందని, మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రమాదకర, విషపూరిత రంగులతో ఆకర్షణీయంగా తయారు చేసే వినాయక విగ్రహాలతో పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. రంగుల వినాయక విగ్రహాల తయారీలో ఉపయోగించే జిప్సం, గంధకం, పీఓపీ మెగ్నీషియం, సీసం లాంటి రంగులతో పర్యావరణానికి ప్రమాదం ఏర్పడుతుందన్నారు. మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసే వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మడిపల్లి ఉపసర్పంచ్ నలుగురి రామలింగం, స్థానికులు ప్రజాపతి ఎల్లయ్య, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాలను అపవిత్రం చేస్తున్న ఎర్రబెల్లి

- మచ్చలేని ఝాన్సీ రెడ్డి పై విమర్శలు చేయడం తగదు
- మాజీ పిఎసిఎస్ చైర్మన్ నిరంజన్ రెడ్డి



**తొర్రూర్ డివిజన్ శుభ తెలంగాణ :**ఆలయాలను అపవిత్రం చేస్తున్న ఎర్రబెల్లి కి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని, ఆగమ శాస్త్ర నిబంధనలను తుంగలో తొక్కి దేవాలయాల పవిత్రతను మంట కలుపుతున్నాడని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ కేతిరెడ్డి నిరంజన్ రెడ్డి దుయ్యబట్టారు.
శనివారం డివిజన్ కేంద్రంలో కాంగ్రెస్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.
నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ....
వల్మిడిలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని మంత్రి ఎర్రబెల్లి రాజకీయ కార్యక్రమంగా మార్చాడని, ప్రజలను, మహిళలను బలవంతంగా తరలించింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. రామునికి ఎడమవైపున ఉండాల్సిన సీతమ్మ విగ్రహాన్ని కుడి వైపు పెట్టి ఆగమశాస్త్ర నిబంధనలను మంట గలపడమే కాక.. అదే సరైన పద్ధతి అని సమర్ధించుకునే ప్రయత్నం చేశాడన్నారు. వల్మిడిలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం జరిగిన రోజు గ్రామంలో ఒకరు చనిపోయారని, ఊర్లో శవం ఉండగా విగ్రహ ప్రతిష్టాపన ఎలా చేస్తారని ప్రశ్నించారు.
భద్రాద్రి ఆలయంలో రామునికి ఏ పక్కన సీతమ్మ ఉందని, దాన్ని ఎర్రబెల్లి గుర్తెరగాలని అన్నారు.ధ్వజస్తంభం ఎంత బరువు ఉన్నదన్న దానిపై అంచనా లేకుండా ఎక్కడం వల్ల అది కూలిపోయిందని తెలిపారు. కురాలికి తెలుగు రాదనడం హాస్యాస్పదమన్నారు.మీ నాయకుడు ఎర్రబెల్లికి ఇంగ్లీష్ వచ్చా అని ప్రశ్నించారు. 70 ఎకరాలు ప్రజాసేవకు ఝాన్సీ రెడ్డి కేటాయిస్తుందని మంత్రిగా ఉండి ఎర్రబెల్లి ఒక్క ఎకరమైన కేటాయించాడని ప్రశ్నించారు. మచ్చలేని మా నాయకురాలు ఝాన్సీ రెడ్డిని విమర్శిస్తే ఊరుకునేది లేదన్నారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యా నాయక్,ఏఎంసీ మాజీ చైర్మన్ అనుమండ్ల నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, బ్లాక్ కాంగ్రెస్ మహిళా విభాగం కాంగ్రెస్ అధ్యక్షురాలు పింగిలి ఉష, మండల మండల అధ్యక్షురాలు ప్రశాంతి,నాయకులు కాందాడి అచ్చిరెడ్డి, చిత్తలూరి శ్రీనివాస్, కాందాడి అశోక్ రెడ్డి, మేకల కుమార్, ముద్రబోయిన వెంకన్న, సుంచు సంతోష్, బిక్షం గౌడ్, మనోహర్, వరప్రసాద్, శీలం హరిత, వెంకట్ రెడ్డి, దీకొండ మధు, రాయి పెల్లి రాజు, కుమారస్వామి, దాసరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె స్వగ్రామం, జనగామ జిల్లా పాలకుర్తి లోని ఆమె కాంస్య విగ్రహానికి పూల మాల వేసి, పుష్పాంజలి ఘటించిన రాష్ట్ర పంచాయతీరాజ్,

- గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



**తొర్రూర్ డివిజన్ శుభ తెలంగాణ :**ఈ సందర్భంగా మంత్రి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ని గుర్తు చేసుకుంటూ, నినాదాలు చేశారు.

**మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కామెంట్స్**

- తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారీమణి చాకలి(చిట్యాల) ఐలమ్మ వర్ధంతి సందర్భంగా వారికి పుష్పాంజలి
- చాకలి ఐలమ్మ జయంతి, వర్ధంతి లను ప్రభుత్వ పరంగా నిర్వహిస్తున్నందుకు సీఎం కెసిఆర్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు
- తెలంగాణ వీర వనిత, ధైర్య శాలి చాకలి(చిట్యాల) ఐలమ్మ
- అనాడు నిరంకుశ నిజాం రజాకార్లను, దేశ్ ముఖులను ఎదుర్కొన్నది.
- నిజాం పాలన, విస్నూరు దేశ్ ముఖ్ కి వ్యతిరేకంగా పోరాడిన యోధురాలు ఐలమ్మ
- రాయపర్తి మండలం కిష్ట పురం లో 1895, సెప్టెంబర్ 26న పుట్టింది.
- పాలకుర్తి కి చెందిన చిట్యాల నర్సయ్య తో పెండ్లి జరిగింది
- 5 గురు కొడుకులు, ఇద్దరు బిడ్డలు
- కుల వృత్తి జీవన ఆధారంగా బతికింది.
- మల్లంపల్లి కొండల రావు కు చెందిన పాలకుర్తిలో ని భూమిని కౌలు కి తీసుకొంది. నాలుగు ఎకరాలు పండించింది.
- ఆ సమయంలో స్థానిక పట్వారీ పొలంలో పనికి రాని ఐలమ్మ పై కమ్యూనిస్టుల లో చేరిందని ఆయన దేశ్ ముఖ్ కి ఫిర్యాదు చేశాడు.
- ఐలమ్మ సాగు చేసిన పొలాన్ని తన పేరున రాయించుకొని ఆ పొలం తనదేనని, ఆ పంట కూడా తనదేనని తన మనుషులను పంపించాడు.
- సంఘం సహాయంతో వాళ్ళని తిప్పి పంపిన ఐలమ్మ, కోర్టు లో కేసు వేసి, అనాడు పేరు మోసిన లాయర్ కొండా లక్ష్మణ్ బాపూజీ సహకారం తో గెలిచింది.
- నాడు సంగం గా పిలిచే, కమ్యూనిస్టుల తో చేయి కలిపి తన పొలాన్ని దేశ్ ముఖ్ గుండాల నుండి కాపాడుకుంది
- వారు చేసిన ఆనాటి ఉద్యమమే, తెలంగాణ సాయుధ పోరాటానికి నాంది అయింది. ఆ తర్వాత మలి దశ తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి అయ్యింది
- చాకలి ఐలమ్మ ధైర్యం, తెగువ చూపుతూ ఆనాటి దేశ్ ముఖులు, రజాకార్ల గుండెల్లో భయం పుట్టించింది.
- ఒకవైపు సాయుధ పోరాటం చేస్తూనే, మరోవైపు అమ్మ లాగా ఉద్యమకారులకు అన్నం పెట్టి ఆదరించిన మహనీయురాలు
- ఐలమ్మ తన 90వ ఏట, 1985 సెప్టెంబర్ 10న పాలకుర్తిలో మరణించారు
- ఐలమ్మ స్ఫూర్తి తోనే సీఎం కెసిఆర్ తెలంగాణ సాధించారు
- అదే స్ఫూర్తి ని సీఎం కెసిఆర్ కొనసాగిస్తున్నారు
- పరిపాలన లో ఉద్యమ స్ఫూర్తిని పాటిస్తున్నారు
- అందుకే తెలంగాణ అన్ని రంగాల్లో అగ్రగామిగా మారింది
- ఐలమ్మ జయంతి, వర్ధంతి లను అధికారికంగా నిర్వహిస్తుండటం పట్ల సీఎం కెసిఆర్ గారికి ధన్యవాదాలు!
- మరోసారి తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఘన0గా పుష్పాంజలి ఘటిస్తున్నాను.

# తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను ప్రభుత్వమే నిర్వహించాలి

**కామ్రేడ్ బందు మహేందర్ సిపిఐ పార్టీ తోరూరు మండల సహాయ కార్యదర్శి**



**తొర్రూర్ డివిజన్ శుభ తెలంగాణ :**తెలంగాణ విముక్తి పోరాటంలో 4000 మంది యువకుమ్నిస్టులను ప్రాణ త్యాగం చేసి సాధించుకున్న ఆనాటి తెలంగాణ, ఈనాడు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం, దాదాపు 1000 మంది విద్యార్థుల బలిదానంతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ ,తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలని అధికారికంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టకపోవడం చాలా బాధాకరమని తొర్రూర్ లోని విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బందు మహేందర్ అన్నారు .ఈనెల 11 నుంచి 17 వ తారీకు వరకు భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను జరుపుకుంటున్నాం ఈ సందర్భంగా 11వ తారీఖు నాడు ఉదయం ఎనిమిది గంటలకు మండలంలోని అమ్మాపురం గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట అమరుల స్తూపం దగ్గర ఘనమైన నివాళులు అర్పిస్తూ ఎర్రజెండా ఎగరేటం జరుగుతుందని చెప్పారు అదేవిధంగా మంగళవారం 12వ తారీకు నాడు ఉదయం ఎనిమిది గంటలకు తొరూరులోని అమరజీవి కామెట్ మన్నూరు వెంకటయ్య గారి సూపన్ దగ్గర కూడా పూలమాలవేసి ఘనమైన నివాళులు అర్పించే కార్యక్రమం తోరూరు మండల సిపిఐ పార్టీ చేపట్టిందని చెప్పారు అలాగే ఈనెల 17వ తారీఖు నాడు తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సమావేశం హైదరాబాదులోని ఎగ్జిబిషన్ గ్రౌండ్లో బ్రహ్మాండమైన బహిరంగ సభ జరుగుతుంది ఈ కార్యక్రమానికి ఈ మండలం నుంచి కూడా కార్యకర్తలు వెళ్ళటం జరుగుతుంది సాయిధ పోరాటం కార్యక్రమాన్ని అధికారంలోకి వచ్చిన తర్వాత కెసిఆర్ గారు ఉద్యమ సమయంలో అధికారికంగా చేపడుతామని చెప్పిన మాటను విస్మరించి కనీసం సాయుధ పోరాట ఉత్సవాల సందర్భంగా జెండా ఆవిష్కరణ కూడా తను చేయకుండా ప్రగతిభవంలోనే కూర్చోవడం చాలా శోచనీయం తెలంగాణ సాయుధ పోరాటాన్ని ఆనాడు ప్రాణాలప్పించిన పోరాట యోధుల కుటుంబాలను గౌరవించే సంస్కృతి కూడా ఈ రాష్ట్ర ప్రభుత్వానికి లేకపోవటం చాలా బాధాకరం కాబట్టి తు మరొక్కసారి ఈ తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఉద్యమాన్ని నిర్మించి ప్రభుత్వం యొక్క మెడలు వంచి అధికారికంగా చేపట్టడం కోసం కమ్యూనిస్టు పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని ఈ సందర్భంగా చెప్పారు తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన ఏ కోరికల కోసం మన నిధులు మనకు మన నీళ్లు మనకు మన కొలువులు మనకు అని పోరాటం చేసిన యువత ఈనాడు 10 సంవత్సరాలు ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిన గాని ఉద్యోగ కల్పన ప్రభుత్వం చేయకపోగా రాష్ట్రాన్ని విపరీతంగా కెసిఆర్ కుటుంబం దోచుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి సభ్యులు గణపురం లక్ష్మను తొర్రూరు మండల కార్యవర్గ సభ్యుడు మంగళంపల్లి మల్లయ్య పాల్గొన్నారు

# క్రీడలు శారీరక మానసిక ఆరోగ్యతోపాటు సహకార భావాన్ని పెంపొందిస్తాయి

D E మధుసూదన్ గారు S E రాజుగారు



**తొర్రూర్ డివిజన్ శుభ తెలంగాణ :** క్రీడలు మనుషులకు శారీరక మానసిక ఆరోగ్యంతో పాటుగా సోదర సహకార భావాన్ని పెంపొందిస్తాయని తొర్రూరు డి ఈ జి మధుసూదన్ %రాజు% రాజుగారు అన్నారు తొరూర్ హైస్కూల్లో తోరూర్ ఎంప్లాయిస్ వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ క్రీడల బహుమతి ప్రధానోత్సవం లో ముఖ్యఅతిథిగా వారు పాల్గొని మాట్లాడారు ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు నగేష్ గారి అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఉపాధ్యాయులు చదువుతోపాటు క్రీడలను ప్రోత్సహించడానికి వారే స్వయంగా వాలీబాల్ ఆటను ఆడుతూ ప్రోత్సహించడం చాలా అభినందనీయం అన్నారు క్రీడలలో గెలుపొందిన దంతాలపల్లి మండల జట్టుకు ప్రథమ బహుమతి నెల్లికుదురు మండల జట్టుకు ద్వితీయ బహుమతి తోరూర్ మండల జట్టుకు తృతీయ బహుమతిని అందజేశారు ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్లు రాయిపల్లి యాకయ్య ఉడుగుల మధుకర్ కో ట విజయ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శంకర్ కోశాధికారి ఫణీంద్ర సంఘ సలహాదారులు జోగు వెంకన్న సభ్యులు కొమ్మన బోయిన వెంకన్న గుర్రం ఎంకన్న రవిజయ్ దర్గా హుస్సేన్ రంజాన్ వెంకటరెడ్డి మురళి సంతోష్ శ్రీనివాస్ రెడ్డి లింగమూర్తి స్థానిక పిఈటి ఐలయ్య తదితరులు పాల్గొన్నారు

# రాంపూర్ లో ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు..

**శుభ తెలంగాణ :**నేడు చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని తాను నివసించి పోరాడిన గడ్డ పాలకుర్తిలో వీర వనిత విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు అనంతరం యాకూబ్ మాట్లాడుతూ
ఐలమ్మ 1895లో వరంగల్ జిల్లా కిష్టాపురంలో చాకలి కుటుంబంలో ఓరుగంటి మల్లమ్మ సాయిలు దంపతులకు జన్మించి పది, పదకొండేళ్ల వయసులో పాలకుర్తికి చెందిన చిట్యాల నరసింహను వివాహం చేసుకొని పదిహేనేళ్లకు కాపురానికి పాలకుర్తికి వచ్చింది అన్నారు. కులవృత్తి బట్టలు ఉతకటం, వృత్తి మాన్యంగా లభించిన నాలుగుమళ్ల భూమిసాగు చేయటం వాళ్లకు బతుకు తెరువు మార్గాలు.మరియు రజాకర్లను ఎదురించి భూమికోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన వీరవనిత ఆమెను స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు.
ఒక వైపు మా దేశాన్ని వదిలివెళ్ళండి అంటూ భారతదేశ ప్రజలు బ్రిటిష్ వారికీ వ్యతిరేకంగా క్విట్ ఇండియా ఉద్యమం నిర్వహిస్తున్న కాలంలో మా భూములను వదిలి వెళ్ళండి అంటూ ఐలమ్మ వంటివాళ్లు దేశీయ భూస్వామ్య పెత్తందారీతనానికి వ్యతిరేకంగా దేశంలో ఎక్కడెక్కడో బతుకు స్వాతంత్ర్యం కోసం పోరాటాలు చేశారు. నాటి పోరాటాలు నేటి యువ సమాజానికి ఆదర్శప్రాయము అన్నారు.
ఈకార్యక్రమంలో పిట్లం సర్పంచుల ఫోరం అధ్యక్షులు రాంపూర్ గ్రామ సర్పంచ్ మందడి నారాయణరెడ్డి, గౌరారం సర్పంచ్ అనసూయ శంకర్, గౌరారం తాండ సర్పంచ్ రవి, బిఆర్ఎస్ నాయకులు రాజిరెడ్డి, అనంత్ రెడ్డి, బాల్ రెడ్డి, రజక సంఘం సభ్యులు, శంకర్, బాలయ్య, మైసయ్య, రమేష్ ,తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్తంగా బీజేపీ కే యువత మద్దతు.

- బీజేపీ పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పూసల శ్రీమాన్.



**తొర్రూర్ డివిజన్ శుభ తెలంగాణ :** దేశవ్యాప్తంగా బీజేపి పార్టీకి, భారత ప్రధాని నరేంద్ర మోది కి యువత మద్దతు అధికంగా ఉందని అనేక సర్వేల్లో ఇది స్పష్టమైందని బిజెపి పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్ అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు బచ్చు సురేష్ అధ్యక్షత జరిగిన సమావేశంలో భారతీయ జనతా పార్టీ యువజన విభాగము భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) తొర్రూరు రూరల్ మండల కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల యువ మోర్చా అధ్యక్షులు గా కొండ రాజు (వెంకటాపురం) ప్రధాన కార్యదర్శులు గాబేతమళ్ళ దీపక్ (పోలేపల్లి), కొమ్ము రేవంత్ (వెలికట్ట) ఉపాధ్యక్షులు బండారి సాయి (మాటేడ్) కొమ్ము రాజు (వెలికట్ట) లను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా బిజెవైఎం మండల అధ్యక్షుడు కొండ రాజు మాట్లాడుతూ యువతను సమీకరిస్తూ పార్టీ బలోపేతానికి పనిచేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన బిజెపి జిల్లా అధ్యక్షుడు ఒద్దిరాజు రాం చందర్ రావు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సిరికొండ సంపత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెదగాని సోమయ్య బిజెపి నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్, మండల అధ్యక్షుడు బచ్చు సురేష్ బీజేపీ కార్యదర్శి రచ్చ కుమార్, పైండ్ల రాజేష్, బిజెవైఎం నియోజకవర్గ కన్వీనర్ ఎనగందుల శ్రవణ్ లకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా నియోజకవర్గ కో కన్వీనర్ కుమ్మరికుంట్ల శివ ప్రసాద్, పప్పుశెట్టి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# దొంగల దాడిలో టేకులపల్లి డ్రైవర్ కు తీవ్ర గాయాలు.



**టేకులపల్లి సెప్టెంబర్ 10 శుభ తెలంగాణ :** గుంటూరు జిల్లాలోని వినుకొండలో శనివారము అర్ధరాత్రి పెట్రోల్ బంకు పార్కింగ్ ప్లేస్ లో టేకులపల్లి కి చెందిన లారీ నెంబర్ 9779 డ్రైవర్ ఇస్లావత్ లాలు నాయక్ పై దొంగల దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి నరసరావుపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఆదివారం కుటుంబ సభ్యులు తెలిపారు. దీని కంటే ముందు రెండు ,మూడు సార్లు పార్కింగ్ ప్లేస్ లో దొంగతనానికి పాలపడటానికి ప్రయత్నించిన, దొంగలపై బంకు యాజమాన్యం ఎటువంటి చర్యలు తీసుకోకపోగా కనీసం పార్కింగ్ ప్లేస్లో కరెంట్ గాని సీసీ ఫుటేజ్ గాని పహరి గోడ రక్షణగానిలేకపోవడంతోదారుణాలుచోటుచేసుకుంటున్నాయి అన్నారు. గతవారం పది రోజులు క్రితం కూడా సెల్ ఫోన్లు డబ్బులు పోగొట్టుకున్నామని ,తోటి బాధిత డ్రైవర్లు మొరపెట్టుకున్నా బంకు యాజమాన్యం పట్టించుకోకుండా కనీసం పోలీస్ కేసు కూడా పెట్టకుండా ఉండడం మూలాన మరోసారి రెచ్చిపోయిన దొంగలు ఫలితంగా డ్రైవర్ కు తీవ్ర నష్టం జరిగిందని పలువురు డ్రైవర్లు అన్నట్లు తెలిపారు. దీనిపై బంకు యాజమాన్యంపై తక్షణమే చర్య తీసుకోవాలని కట్టినమైన చర్య తీసుకోవాలని కచ్చితంగా ఆ దొంగలకు బంకుకు సంబంధాలు ఉన్నాయని అనుకోవాల్సిన పరిస్థితి, ఎందుకంటే ఒకసారి రెండుసార్లు సంఘటనలు జరిగినప్పుడు ఎటువంటి చర్యలు చేపట్టక పోగా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. కచ్చితంగా బంకు యాజమాన్యానికి దొంగలకు కనెక్షన్ ఉండే ఉంటుందని, తక్షణమే అటువంటి బంకు యాజమాన్యంపై చర్యలు తీసుకునే వరకు తమ వంతు సహాయ సహకారాలు అందించవలసిందిగా తోటి డ్రైవర్లను ఓనర్లను కోరారు. డ్రైవర్ కు పూర్తి ఆసుపత్రి ఖర్చులు, బంకుయాజమాన్యం భరించే విధంగా కుటుంబీకులు కోరారు.

# 'పట్నం ' కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్ రెసులో..... కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్

**ఇబ్రహీంపట్నం శుభ తెలంగాణ :** గత 30సవంత్సరాల నుండి కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఒక బి.సి బిడ్డా కురుమ సామాజిక వర్గానికి చెందిన బహుజన బిడ్డా కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్ గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో రంగారెడ్డి జిల్లా లోని హయత్ నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా, ప్రస్తుతం టిపిసిసి కార్యదర్శిగా, టిపిసిసి ప్రచార కమిటీ సభ్యులుగా కొనసాగుతున్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అప్పటి శాసన సభ్యులు సుదీర్ కుమార్, మల్ రెడ్డి రంగారెడ్డి, తెలంగాణ ఏర్పాటు తరువాత 2013లో ఇబ్రహీంపట్నం లో పోటీ చేసిన క్యామ మల్లేష్, ఆ తరువాత పొత్తులో భాగంగా ఇబ్రహీంపట్నం లో పార్టీ ఆదేశాల మేరకు సపోర్ట్ చేయడం జరిగింది. కొంతమంది తమ స్వార్థం కోసం పార్టీలు మారిన నేపథ్యంలో ఒకే పార్టీ ఒకే సిద్ధాంతంతో గత 30 సంవత్సరాల నుండి పార్టీకి సేవ చేస్తున్న కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్ కి కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయిస్తే ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని ప్రజల్లో ఊహాగానాలు వినిపిస్తున్నావి, ఎప్పుడు ప్రజలకు అందుబాటులో వుండే వీరు గెలుస్తే ప్రజాసేవలో ముందుంటారని అంటున్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ప్రజాధరణ పొందిన బి.సి వర్గానికి చెందిన వారికీ అవకాశం ఇవ్వాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఇబ్రహీంపట్నం 60 శాతనికి పైగా వున్నా బి.సి ఓట్లను దృష్టిలో పెట్టుకొని పార్టీ అధిష్టానం వీరిని గుర్తించి తగిన న్యాయం చేయాలంటున్నారు. తెలంగాణ రాష్ట్ర లో అతిపెద్ద మున్సిపాలిటీ అయిన తుర్కయంజల్ మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షురాలుగా కొనసాగుతున్న శివకుమార్ సతీమణి కూడా ప్రజల్లో మంచి పట్టు, సేవ గునం కలిగిన నాయకురాలు కొత్తకుర్మ మంగమ్మ గతంలో ఈమె తుర్కయంజాల్ గ్రామ సర్పంచ్ గా అలాగే ప్రస్తుతం మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షురాలుగా స్థానిక 21వ వార్డు కౌన్సిలర్ గా సేవల%శీ%దిస్తున్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గా అవకాశం వున్నా కొన్ని కారణాలవళ్ళ ఆ పదవి దక్కలేకపోయింది బిసి వర్గానికి చెందిన వారు మంగమ్మ శివకుమార్ కి టికెట్ కేటాయిస్తే ఇబ్రహీంపట్నం లో కాంగ్రెస్ గెలుపు కాయం అని అంటున్నారు.

# స్త్రీ శక్తికి నిలువెత్తు నిదర్శనం వీరనారి చాకలి (చిట్యాల) ఐలమ్మ.

- రజక వృత్తిదారుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు నల్లూరి రామలింగం, జిల్లా కార్యదర్శి పున్న%శీ% సారయ్య.
- తొర్రూరులో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 38వ వర్ధంతి సభ.



**(తొర్రూర్ డివిజన్ శుభ తెలంగాణ :** తెలంగాణ సాయిధ పోరాట యోధురాలు స్త్రీ శక్తికి నిలువెత్తు నిదర్శనం వీరనారి చాకలి (చిట్యాల) ఐలమ్మ అని, ప్రతి ఒక్కరూ ఆమె స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని ఐలమ్మ పోరాట స్ఫూర్తితో తమ హక్కులను సాధించుకునేందుకు ఉద్యమాలకు సిద్ధం కావాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు నల్గూరి రామలింగం, జిల్లా కార్యదర్శి పున్నం సారయ్య లు పిలుపునిచ్చారు. ఆదివారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద వీరనారి చాకలి ఐలమ్మ 38వ వర్ధంతి సభ ను తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతి సభకు విశిష్ట అతిథిగా జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యులు, భరసా రాష్ట్ర నాయకులు రామ సహాయం కృష్ణ కిషోర్ రెడ్డి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. అనంతరం ఏర్పాటుచేసిన ఐలమ్మ వర్ధంతి సభలో చేతివృత్తి దారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ బొల్లం అశోక్, నల్గూరి రామలింగం, పున్నం సారయ్యలు మాట్లాడుతూ ఒకప్పటి చెన్నూరు నియోజకవర్గం ప్రస్తుత పాలకుర్తి నియోజకవర్గం లోనీ కిష్టాపురం గ్రామంలో పుట్టి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో విరోచిత పోరాటం చేసిన యోదురాలు చిట్యాల ఐలమ్మ అని కొనియాడారు. రజక వృత్తిదారులంతా ఐక్యంగా ఉండి ఐలమ్మ పోరాటస్ఫూర్తితో తమ హక్కులను సాధించుకోవడానికి ఉద్యమించాలని రజక వృత్తిదారులను కోరారు. రజక వృత్తిని కోల్పోయి రజకులంతా పట్టణాలకు వలస వెళ్లి పూట గడవని పరిస్థితుల్లో రజక వృత్తిదారులు బ్రతుకు వెళ్లదీస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణాలలో రజక వృత్తిదారుల మహిళలు ఇండ్లలో పనిచేస్తుంటే లేనిపోని నిందలు వేయడమే కాకుండా రజకులను కించపరచడమే కాకుండా అత్యాచారాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయని అన్నారు. మహిళా రజక వృత్తిదారుల కోసం రజకులకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకు రావాలని, 50 ఏళ్లు నిండిన రజక వృత్తిదారులకు పెన్షన్ పథకం వర్తింపజేసే విధంగా చర్యలు తీసుకోవాలని, రజక వృత్తిదారులకు ఉచిత విద్యుత్ పథకం ఎల్టి2 నుండి ఎల్టి4 వరకు మార్చాలని, రజక వృత్తిదారుల కుటుంబాలు అందరికీ రెండు పడక గదుల ఇల్లు ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని, రాష్ట్ర రాజధాని ట్యాంక్బండ్ పై, తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలలో వీరనారి ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రజక వృత్తిదారులకు ప్రభుత్వ కార్యాలయాలు, హాస్టల్లు, ఆసుపత్రులు తదితర వాటిలో రజక వృత్తిదారులకే దోబీ కాంట్రాక్టులు ఇవ్వాలని అన్నారు. రజకులు రజక వృత్తిదారులు సంఘటితంగా తమ హక్కుల సాధన కోసం ఐలమ్మ పోరాట స్ఫూర్తితో సాధించు కోవడానికి ముందుకు రావాలని రజకులను రజక వృత్తిదారులను కోరారు. ఈ కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గొల్లపల్లి వెంకటేష్, తొర్రూరు మండల అధ్యక్షుడు నిమ్మల సోమయ్య, కార్యదర్శి పొడగంటి శేఖర్, సహాయ కార్యదర్శి చింతల మధు, సంఘం నాయకులు లోకుంట్ల రాములు, సంతోష్, రామకృష్ణ, రాజు, కార్తీక్, చింతల వెంకన్న, సైదులు, ఉప్పలయ్య, బిక్షం, మురళి, అంజయ్య, కృష్ణ, నరేష్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# రానున్నది రామ రాజ్యమే, కాషాయ జెండా ఎగరవేయడం ఖాయం..

- భాజపా జిల్లా అధ్యక్షులు పివి శ్యాంసుందర్రావు
- బిజెపిలో చేరిన గ్రామ యువకులు





**వలిగొండ శుభ తెలంగాణ :** వలిగొండ మండలం లోనీ వెంకటాపురం గ్రామంలో భారతీయ జనతా పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు జక్క మచ్చగిరి ఆధ్వర్యంలో ఆదివారం రోజున బీజేపీ జిల్లా అధ్యక్షులు పీవీ శ్యామ్ సుందర్ రావు ముఖ్య అతిథులుగా హాజరైనారు ఈ సందర్భంగా వలిగొండ మండలంలోని వెంకటాపురం గ్రామంలో శ్యామ్ సుందర్ రావు పార్టీ జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది తదనంతరం పలువురు యువకులను గ్రామ శాఖ ఆధ్వర్యం లో జిల్లా అధ్యక్షులు కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ
రాష్ట్రం లో ఉద్యమ ఆకాంక్షలకు విరుద్ధంగా పాలన జరుగుతుందని, నియంత్రుత్వ కేసిఆర్ ను గద్దె దించడమే భారతీయ జనతా పార్టీ లక్ష్యమని భారతీయ జనతా పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు శ్రీ పి వి శ్యామ్ సుందర్ రావు అన్నారు. రాష్ట్ర ఏర్పాటు సమయం లో మిగులు బడ్జెట్ తో రాష్ట్రాన్ని కేసిఆర్ ప్రభుత్వం అప్పుల కుప్పగా మార్చిందని వారు అన్నారు. 1200 ల మంది బలిదానాలతో ఏర్పాటు అయిన తెలంగాణ ఫలాలు కేవలం కేసిఆర్ కుటుంబం మాత్రమే అనుభవిస్తున్నారని ఆయన అన్నారు. కుటుంబ పాలన నుండి రాష్ట్రాన్ని విముక్తి చేసి ప్రజాసామ్య తెలంగాణ ఏర్పాటు కోరకు భాజపా పోరాటం చేస్తుందని ఆయన అన్నారు మరి కొద్ది రోజుల్లో ఆయుష్మాన్ భారత్ కార్డులను సెప్టెంబర్ 17 సందర్భంగా అందరికీ అంద జేస్తమని అన్నారు కేంద్రం నుంచి వచ్చే నిధులతోనే గ్రామంలో అభివృద్ధి జరుగుతుందని అన్నారు ఎన్నికల్లో బిజెపిని గెలిపించాలని అన్నారు ఈ కార్యక్రమం అనంతరం గ్రామ శాఖ ఆధ్వర్యంలో భోజన కార్యక్రమాన్ని గ్రామంలో ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సీఎన్ రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవుల నరేందర్, రాజశేఖర్ రెడ్డి,రాచకొండ కృష్ణ, చిరిగే శ్రీనివాస్,తరుణ్, బచ్చు శ్రీనివాస్, మారోజు అనిల్ కుమార్ వెలిమినేటి వెంకటేష్,కొత్త రామ చందర్,యాస ఆయిల్ రెడ్డి ,శక్తి కేంద్ర ఇంఛార్జి జక్క నర్సిరెడ్డి ,రుద్రపల్లి మచ్చగిరి,పొలబోయిన శేఖర్,జక్కల్ మచ్చగిరి కాడిగాల్ల రాజు,రవి, కొత్త మచ్చగిరి,కాడిగల్ల మధు, సిహెచ్ నరేష్, కొత్త శివ జక్కల శ్రీకాంత్,సురేష్,శ్రీశైలం తడి తరులు పాల్గొన్నారు.

# పిట్లం లో ఘనంగా ఐలమ్మ వర్ధంతి వేడుకలు



**శుభ తెలంగాణ :**కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలోని వీరనారి చాకలి ఐలమ్మ 38వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి గ్రామ యువకులు ప్రజలు నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నాయకులు ఐలమ్మ చేసిన పోరాటాని గురించి మాట్లాడుతూ భూమి కోసం,భుక్తికోసం,వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీరవనిత ఆమె స్ఫూర్తి తో నే తెలంగాణ రాష్టాన్ని సాధించం అన్నారు ఐలమ్మ పోరాటాని కులానికే అంకితం చేయకుండా అనివార్గాల ప్రజలు ఆమె పోరాట స్పూర్తితో ముందుకు పోవాలాని అన్నారు.ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు చాకలి అశోక్ రాజ్, నియోజకవర్గం అధ్యక్షులు చాకలి అంబాదాస్ మరియు రజక సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మంచి ఆరోగ్యానికి నడక, వ్యాయామమే మంచి మార్గం...

**అటవీ ప్రాంతాల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు...**

**4కే రన్ కు హాజరైన మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి..**

**ఎల్బీనగర్, శుభ తెలంగాణ :**మంచి ఆరోగ్యానికి నడక, వ్యాయామమే మంచి మార్గమని అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. ఆదివారం మహవీర్? హరిణ వనస్థలి నేషనల్? పార్క్ లో వాకర్స్ అసోసియేషన్ ఆద్వర్యంలో నిర్వహించిన 4కే రన్ కార్యక్రమంలో అటవీశాఖ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, ఎల్బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి జెండా ఊపి 4కె రన్ ప్రారంభించి, ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. ఇలాంటి రన్ కార్యక్రమాలను నిర్వహించి ప్రజల్లో నడక, సహజ ఆరోగ్య చైతన్యం తేవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు నడకను అనుసరించాలని, డాక్టర్లు చెబుతున్నారని, అనేక అనారోగ్య సమస్యల నుంచి బయటపడే దారి నడకే అన్నారు. పట్టణ, నగర ప్రజలకు ఆహ్లాదాన్ని పంచటంతో పాటు పర్యావరణ పరిరక్షణ, అటవీ భూముల సంరక్షణ కోసం ఫారెస్ట్ బ్లాకుల్లో అర్బన్ లంగ్స్ స్పేస్ (అర్బన్ ఫారెస్ట్ పార్కులు)గా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ అర్బన్ పార్కుల్లో వాకర్స్ ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేస్తుండగా, ఆహ్లాదం, ఆనందం కోసం వీకెండ్ లో సందర్శకులు సేద తీరుతున్నారని పేర్కొన్నారు. రిజర్వ్ ఫారెస్ట్ బ్లాక్ లో ఉన్న కొత్తగూడలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి బోటానికల్ గార్డెన్ ను ఉమ్మడి పాలనలో వాణిజ్య అవసరాలకు లీజుకు ఇస్తే దాన్ని అడ్డుకున్న ఘనత ఆ ప్రాంత వాకర్స్ కు దక్కుతుందని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక దాన్ని ఎకో టూరిజం పార్కుగా అభివృద్ధి చేశామన్నాని వెల్లడించారు. అనంతరం సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎల్బినగర్ నియోజకవర్గ ప్రజల ఆరోగ్యమమే తనకు ముఖ్యం అని తెలిపారు. ఎల్బినగర్ నియోజకవర్గ పరిధిలో ఉన్న పార్కులు దేశంలో మరెక్కడా లేవని తెలిపారు. అలాగే ఇందు అరణ్య దగ్గర ఉన్న స్థలం నందు ఒక వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని మంత్రి ని కోరడం జరిగింది. అలాగే అక్కడ ఉన్న అటవీశాఖ వారి స్థలం తమదే అని కొందరు ప్రైవేటు వ్యక్తులు ఇతరులకు అమ్మడం జరుగుతున్న విషయం మా దృష్టికి రావడం జరిగింది. సదరు వారిని పిలిచి మందలించడం జరిగింది అని తెలిపారు. కావున స్థలాలు ఎవరు కొనుగోలు చేయొద్దని తెలిపారు. మహావీర్ హరిణ వనస్థలి పార్క్ ను రాబోయే రోజుల్లో ఒక కేబీఆర్ పార్కుల తీర్చిదిద్దలని కోరారు. అలాగే పార్క్ ల నందు క్యాంపింగ్ ఏర్పాటు చేయాలని సుధీర్ రెడ్డి కోరారు. దాని వల్ల అటవీశాఖ వారికి ఆదాయం లభిస్తుంది అని తెలిపారు. అలాగే వర్షాలకు గాను వాకింగ్ ట్రాక్ లోని రోడ్డు కోసుకొనిపోవడం జరుగుతుంది. కావున శాశ్వతంగా ఒక రోడ్డు రోలర్ మంజూరు చేయాలని కోరారు. అలాగే ప్రతి 45 రోజులకు ఒకసారి హెల్త్ క్యాంపు ఏర్పాటు చేయాలని కోరారు. పార్కు నందు ఓపెన్ జిమ్ మంజూరు కావడం జరిగింది. కావున త్వరగా ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే కొన్ని చోట్ల పార్క్ ప్రహరీ గోడలు కూలిపోవడం జరిగిన నేపథ్యంలో నూతన ప్రహరీ పనుల నిమిత్తం ఒక కోటి 82 లక్షల రూపాయలు మంజూరు కావడం జరిగింది అని తెలిపారు. అలాగే వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఫూట్ ఓవర్ బ్రిడ్జి కావాలని అడగడం జరిగింది అని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వచ్చాక పచ్చదనం విషయంలో దాదాపు 30% పచ్చదనం పెరిగింది అని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తప్పకుండా మీరు అడిగిన అన్నీ కోరికలు నెరవేస్తామని హామీ ఇచ్చారు. అటవీశాఖ స్థలాలు కబ్జాకు గురికాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్ రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, రంగారెడ్డి జిల్లా డీఎఫ్ఓ డి. సుధాకర్ రెడ్డి, వనస్థలిపురం ఇన్స్పెక్టర్ డి. జలంధర్ రెడ్డి, వనస్థలిపురం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఎల్. బాలు చౌహన్, డీర్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రామిడి విజేందర్రెడ్డి, ప్రధాన కార్యదర్శి జక్కా రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published & Owned by Sri ChandraShekar.Corporate Office : Rama Krishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India.RNI-TELTEL/2017/72695,Editor :ChandraShekar.Cell :7799911110.Email:subhatelangana@gmail. com